వర్షంతో చల్లబడిన నగరం
- 7వ పేజీలో



బదిలీల హడావిడి

రెవెన్యూ శాఖలో పలువురు తహశీల్దార్లకు స్థానచలనం తప్పదా?

- ఏజెన్సీ నుంచి విశాఖకు పలువురి రాక
- ట్రెజరీ విభాగంలో ఏళ్ల తరబడి తిష్ట వేసిన కొందరు ఉద్యోగులు
- జూన్ 2వ తేదీలోగా ముగియనున్న ప్రక్రియ

విశాఖపట్నం, మే 18 (ఆంధ్రజ్యోతి):

ప్రభుత్వ ఉద్యోగుల సాధారణ బదిలీలపై నిషేధాన్ని తాత్కాలికంగా ఎత్తివేశారు. ఈ నెల 16 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు బదిలీల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతించడంతో జిల్లాలో పలు ప్రభుత్వశాఖల్లో బదిలీల హడావిడి మొదలైంది. ఈ ఏడాది మే 31 నాటికి ఒకేచోట ఐదేళ్లు సర్వీసు పూర్తిచేసుకున్న ఉద్యోగులను తప్పనిసరిగా బదిలీ చేయాలన్న ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అన్ని శాఖల్లో ఉన్న అటువంటి ఉద్యోగులను గుర్తించే పనిలో ఉన్నతాధికారులు నిమగ్నమయ్యారు.

జిల్లాల విభజన తరువాత అన్ని శాఖల్లో కొందరు ఉద్యోగులకు స్థానచలనం జరిగింది. ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన బదిలీలు నిర్వహించడంతో 2022 ఏప్రిల్ నాటికి మిగిలిన ఉద్యోగుల్లో ఐదేళ్లు సర్వీసు పూర్తిచేసిన వారికి బదిలీలు అనివార్యమని స్పష్టమైంది. ఈ నేపథ్యంలో అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల్లో ఐదేళ్లు సర్వీసు పూర్తి చేసిన ఉద్యోగులు విశాఖ జిల్లాకు రావడానికి అవకాశం ఏర్పడింది. నోడల్ జిల్లాగా ఉండడంతో విశాఖ కలెక్టర్ ఆధ్వర్యంలోనే బదిలీలు జరగనున్నాయి. దీంతో ఆయా జిల్లాల్లో బదిలీలు కోరుకునే ఉద్యోగుల వివరాలను పంపాలని అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల కలెక్టర్లకు ఆయన లేఖలు రాయనున్నారు.

రెవెన్యూ శాఖలో బదిలీలకు భారీ కసరత్తు

రెవెన్యూ శాఖలో బదిలీల కోసం భారీ కసరత్తు జరిగే అవకాశం ఉంది. ఏజెన్సీలో ఐదేళ్లు సర్వీసు పూర్తిచేసి 55 ఏళ్లు దాటిన ఉద్యోగులు విశాఖ లేదా అనకాపల్లి జిల్లాకు రావడానికి నిర్ణయించుకున్నారు. గత ఏడాది బదిలీల్లో



విశాఖ జిల్లాకు రావడానికి దరఖాస్తు చేసిన ముగ్గురు తహసీల్దార్లను అల్లూరి సీతారామరాజు జిల్లా యంత్రాంగం రిలీవ్ చేయలేదు. మైదాన ప్రాంతం నుంచి ఏజెన్సీకి వెళ్లేందుకు కొందరు విముఖత చూపడంతో ఈ ముగ్గురు తహసీల్దార్లు పాడేరు డివిజన్‌లోనే పనిచేస్తున్నారు. జిల్లాల విభజన సమయంలో జూనియర్లను పాడేరు జిల్లాకు పంపడంలో అప్పటి అధికారులు చేసిన పొరపాట్లను ప్రస్తుత అధికారులు సవరించాలని పలువురు కోరుతున్నారు. కాగా విశాఖ జిల్లాలో పనిచేస్తున్న కొద్ది మంది తహసీల్దార్లకు బదిలీ తప్పదని రెవెన్యూ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. గత ఏడాది కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏరికోరి మండలాలకు పోస్టింగ్స్ కోసం సిఫారసు చేసిన ఎమ్మెల్యేలు ఇప్పుడు వారి విషయంలో విభేదిస్తున్నారు. ఇద్దరు ముగ్గురు తహసీల్దార్లు జిల్లా యంత్రాంగం అంచనాలకు భిన్నంగా పనిచేయడం లేదని, భూ లావాదేవీల్లో ఆరోపణలు చుట్టుముట్టడంతో వారికి బదిలీలు తప్పవని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

అదేవిధంగా పౌరసరఫరాలశాఖలో పలువురు అధికారులు, చెకింగ్ ఇన్‌స్పెక్టర్లకు బదిలీలు జరుగుతాయని పలువురు పేర్కొంటున్నారు. ఏఎస్‌వో కేడర్ అధికారి ఒకరు డీలర్ల సంఘ నేత ద్వారా సొంతంగా రేషన్ డిపోలను నిర్వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఉమ్మడి జిల్లాలో టీడీపీ సీనియర్ నేత మనిషినంటూ జిల్లా అధికారులను లెక్కచేయడం లేదనే వాదన వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో సదరు ఏఎస్‌వోపై బదిలీ వేటు పడవచ్చని ప్రచారం జరుగుతోంది.

విశాఖ ఖజానా శాఖలో ఏళ్ల తరబడి పలువురు తిష్ట

విశాఖ జిల్లా ఖజానాశాఖ కార్యాలయంలో పలువురు ఉద్యోగులు ఏళ్ల తరబడి కొనసాగుతున్నారు. వీరిలో పలువురిపై పలు రకాల ఆరోపణలున్నాయి. ఓ ఉద్యోగి 15 ఏళ్లుగా ఇక్కడే తిష్ట వేశారు. అటెండరుగా చేరిన ఉద్యోగి ఒకరు జూనియర్ అకౌంటెంట్‌గా, ఆ తరువాత సీనియర్ అకౌంటెంట్‌గా పదోన్నతి పొంది ఇక్కడే పని చేస్తున్నారు. అలాగే సర్వీస్ కమిషన్ ద్వారా రిక్రూట్ అయిన ఉద్యోగులు

... మిగతా 6వ పేజీలో



తిరంగ ర్యాలీలో పాల్గొన్న కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, మేయర్ పీలా శ్రీనివాసరావు, వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, తదితరులు.

సత్తా చూపిన త్రివిధ దళాలు

కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ

- ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన నేపథ్యంలో తీరంలో ఘనంగా తిరంగా ర్యాలీ

7లో

కేజీహెచ్‌లో ఆధిపత్య పోరు!

ఇద్దరు ఉన్నతాధికారుల మధ్య నలిగిపోతున్న ఉద్యోగులు

- ఒకరు ఔనంటే.. మరొకరు కాదంటుండడంతో తప్పని తిప్పలు
- ఏడీ అకౌంట్‌లోకి జమ అయిన నగదు బదిలీ విషయంలో కోల్డ్ వార్
- ఓ ఉన్నతాధికారి నోటి దురుసుతనానికి భయపడుతున్న చిరుద్యోగులు

విశాఖపట్నం, మే 18 (ఆంధ్రజ్యోతి):

ఉత్తరాంధ్ర ప్రజల పెద్దాస్పత్రిగా పేరొందిన కేజీహెచ్‌లో ఇద్దరు ఉన్నతాధికారుల మధ్య నెలకొన్న ఆధిపత్య పోరు ఉద్యోగులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇద్దరు ఉన్నతాధికారులు ఒకరిపై ఒకరు ఆధిపత్యాన్ని ప్రదర్శించేందుకు యత్నిస్తుండడంతో ఉద్యోగులకు తిప్పలు తప్పడం లేదు. ఇప్పటికే ఆస్పత్రిలో పనిచేసే ఉద్యోగులంతా రెండు వర్గాలుగా చీలిపోయారు. కొందరు సూపరింటెండెంట్ వర్గంలో ఉంటే, మరికొందరు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వర్గంలో ఉన్నారు. ఇద్దరు ఉన్నతాధికారులు తమకు తెలియకుండా ఏమీ జరగకూడదని చెబుతుండడంతో ఉద్యోగులు ఏ పనీ చేయలేని దుస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఇప్పటికే అనేక ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నట్టు పలువురు చెబుతున్నారు. ఇరువురు అధికారుల కార్యాలయాల్లోకి ఎవరెవరు వెళుతున్నారన్న విషయాన్ని తెలుసుకోవడంపైనే వారు దృష్టి సారిస్తున్నారు.



ఎవరైనా ఉద్యోగి ఒక అధికారి కార్యాలయం లోపలకు వెళ్లి వస్తే.. వెంటనే మరో అధికారి సదరు ఉద్యోగిని పిలిపించి ఏమిటి విషయం అని అడుగుతున్నట్టు పేర్కొంటున్నారు. ఆస్పత్రిలో తనిఖీలను కూడా ఇద్దరు అధికారులు వేర్వేరుగా నిర్వహిస్తున్నారు. ఇద్దరూ కలిసి కూర్చుని మాట్లాడుకున్న దాఖలాలు కూడా లేవని చెబుతున్నారు. ఒకవేళ ఎవరైనా ప్రజాప్రతినిధులు, ఇతర ఉన్నతాధికారులు వచ్చే ముందు ఏర్పాటు చేసే సమావేశాల్లో కూర్చున్నా.. వీరిద్దరూ కలిసి చర్చించుకునే పరిస్థితులు లేవంటున్నారు. ఇద్దరి మధ్య పూడ్చలేని స్థాయిలో అగాధం కూరుకుపోయిందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఆస్పత్రిలో వివిధ పనులు నిర్వహించే కాంట్రాక్టర్లకు సంబంధించిన వ్యవహారాల్లోనూ వీరిద్దరి మధ్య బేధాభిప్రాయాలు తలెత్తినట్టు పలువురు చెబుతున్నారు.

అలాగే కేజీహెచ్ డ్రాయింగ్ ఆఫీసర్ అకౌంట్‌లో సుమారు

... మిగతా 6వ పేజీలో

డిప్యూటీ మేయర్ జనసేనదే?

కూటమి నేతల మధ్య కుదిరిన అంగీకారం!

- అభ్యర్థి ఎవరు అనేదానిపై ఉత్కంఠ
- ఉషశ్రీ, దల్లి గోవిందరెడ్డి మధ్య పోటీ
- వైసీపీ నుంచి వచ్చిన వారికి అవకాశం కల్పిస్తే టీడీపీ నుంచి వ్యతిరేకత వచ్చే అవకాశం
- నేడే డిప్యూటీ మేయర్ ఎన్నిక

విశాఖపట్నం, మే 18 (ఆంధ్రజ్యోతి):

మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) డిప్యూటీ మేయర్ పదవిపై కూటమి పార్టీల మధ్య ఎట్టకేలకు అవగాహన ఒప్పందం కుదిరినట్టు తెలిసింది. డిప్యూటీ మేయర్ పదవి కోసం ఆదివారం రాత్రి వరకు హోటల్ దసపల్లా ఎగ్జిక్యూటివ్ కోర్టులో కూటమి పార్టీల ప్రజాప్రతినిధులు, మేయర్ సుదీర్ఘంగా చర్చించి అవగాహనకు వచ్చినట్టు సమాచారం. డిప్యూటీ మేయర్ పదవి తమకే కావాలని జనసేన నాయకులు గట్టిగా పట్టుబట్టడంతో టీడీపీ నేతలు అంగీకరించాల్సి వచ్చినట్టు తెలిసింది. అయితే అభ్యర్థి ఎవరనే దానిపై మాత్రం జనసేన నేతలు ఒక నిర్ణయానికి రాలేదని భోగట్టా.



74వ వార్డు కార్పొరేటర్ దల్లి గోవిందరెడ్డి, 43వ వార్డు కార్పొరేటర్ ఉషశ్రీ పేర్లను వారు ప్రతిపాదించినట్టు తెలిసింది. అయితే ఉషశ్రీ వైసీపీ నుంచి కార్పొరేటర్‌గా గెలిచి ఇటీవలే జనసేనలో చేరినందున ఆమె అభ్యర్థిత్వం పట్ల ఆ పార్టీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్టు సమాచారం. డిప్యూటీ మేయర్ పదవికి సాంకేతికంగా కూడా ఆమె అనర్హురాలని వాదిస్తున్నట్టు తెలిసింది. జనసేన నుంచి కార్పొరేటర్‌గా గెలిచిన వారికే అవకాశం కల్పించాలని కోరుతున్నట్టు తెలియవచ్చింది. జనసేన నుంచి కార్పొరేటర్‌గా గెలిచిన భీశెట్టి వసంతలక్ష్మి పార్టీ ఫ్లోర్ లీడర్‌గా పనిచేస్తున్నారు. ఆమెకు అవకాశం ఇవ్వాలనుకున్నా ఆమె సామాజిక వర్గానికి చెందిన పీలా శ్రీనివాసరావు మేయర్‌గా ఉండడం అడ్డంకిగా మారింది. మరో కార్పొరేటర్ అయిన పీతల మూర్తియాదవ్ తనకు పదవి వద్దని ఇంతకుముందే స్పష్టం చేశారు. కానీ జనసేనకు డిప్యూటీ మేయర్ పదవిని ఇవ్వాల్సిందేనంటూ పార్టీ అధిష్ఠానానికి ఆయన పలుమార్లు లేఖలు రాశారు. దీనిపై స్పందించిన అధిష్ఠానం డిప్యూటీ మేయర్ పోస్టును తీసుకోవాల్సిందేనని స్థానిక జనసేన ప్రజాప్రతినిధులకు ఆదేశించడంతో ఆ పదవి కోసం వారు గట్టిగా పట్టుబట్టినట్టు సమాచారం. వీరిద్దరిని మినహాయిస్తే చివరకు జనసేన నుంచి 64వ వార్డు కార్పొరేటర్‌గా గెలిచిన దల్లి గోవిందరెడ్డి మాత్రమే మిగిలారు. దీంతో

... మిగతా 6వ పేజీలో

గణితం-1, ఫిజిక్స్-2 పేపర్లు కఠినం

విద్యా నిపుణుడి విశ్లేషణ



చినముషిడివాడలోని ఐయాన్ డిజిటల్ కేంద్రంలో పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులు

- ప్రశాంతంగా జేఈఈ అడ్వాన్స్‌డ్

విశాఖపట్నం, మే 18 (ఆంధ్రజ్యోతి):

దేశంలో ఐఐటీ/తత్సమాన విద్యా సంస్థల్లో ప్రవేశాలకు ఆదివారం నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ నగరంలో పది కేంద్రాల్లో ప్రశాంతంగా ముగిసింది. ఈ పరీక్షలను పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో నిర్వహించారు. ఉదయం పేపర్ 180 మార్కులు, మధ్యాహ్నం పేపర్ 180 మార్కులకు ప్రశ్నపత్రాలను రూపొందించారు. గణితం, భౌతిక, రసాయన శాస్త్రాలకు సంబంధించి ఉదయం 48, మధ్యాహ్నం 48 ప్రశ్నలు ఇచ్చారు. ప్రతి సబ్జెక్టుకు 120 మార్కుతో ప్రశ్నలు ఇచ్చారు. అయితే ఉదయం ఇచ్చిన పేపరులో గణితం-1, మధ్యాహ్నం ఇచ్చిన పేపరులో ఫిజిక్స్-2లో ప్రశ్నలు కఠినంగా ఉన్నాయని శ్రీచైతన్య ఐఐటీ అకాడమీ డీన్ ఎస్.రఘుకుమార్ తెలిపారు. పరీక్షలు రాసిన విద్యార్థుల నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్ మేరకు ప్రశ్నపత్రాలను విశ్లేషించినట్టు ఆయన పేర్కొన్నారు. ఉదయం పేపరులో ఫిజిక్స్ కొంతవరకు బాగానే ఉందని, కెమిస్ట్రీలో ప్రశ్నలు సులువుగా ఉన్నాయన్నారు. మధ్యాహ్నం పేపరులో ఫిజిక్స్ ప్రశ్నపత్రం కఠినంగా ఉందని, మేథమెటిక్స్, కెమిస్ట్రీ బాగానే ఉందని విద్యార్థులు తెలిపారన్నారు. కాగా నగరంలోని పది కేంద్రాలకు ఉదయం ఏడు గంటలకు విద్యార్థులు చేరుకున్నారు. ప్రతి విద్యార్థిని క్షుణ్ణంగా తనిఖీ చేశాకే పరీక్ష కేంద్రంలోకి అనుమతించారు. విద్యార్థినులకు మాత్రం ముక్కుపుడుక, చెవిదుద్దులు, రింగులు, గొలుసులతో అనుమతించలేదు. వాటిని తొలగించిన తరువాతే అనుమతించారు. ఈ పరీక్షలకు నగరంలోని అన్ని కేంద్రాల నుంచి సుమారు నాలుగు వేల మంది విద్యార్థులు హాజరయ్యారు.

స్టీల్‌ప్లాంటులో 300 టన్నుల ఉక్కు ద్రవం నేలపాలు

- వార్త 7వ పేజీలో

మెడికల్ సర్టిఫికెట్ల మాయాజాలం!

- గతంలో జారీ చేసిన ధ్రువపత్రాలపై అనుమానాలు
- బోర్డు ఎదుట 442 మంది ఉపాధ్యాయులు హాజరు
- సగం మందికి 56 శాతానికి పైగా వైకల్యం లేదని నిర్ధారణ
- 160 మంది వరకు మెడికల్ బోర్డు ఎదుట హాజరు కాని వైనం

విశాఖపట్నం, మే 18 (ఆంధ్రజ్యోతి):

ఉపాధ్యాయుల బదిలీల్లో కీలకమైన ప్రాధాన్యత పాయింట్ల కేటాయింపునకు సంబంధించి మెడికల్ సర్టిఫికెట్ల జారీ వ్యవహారంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సర్టిఫికెట్ల కోసం మెడికల్ బోర్డు ఎదుట హాజరైన వారిలో సగం మందికి 56 శాతం కంటే తక్కువ శాతం వైకల్యం ఉండడంతో వారు ప్రాధాన్యత కేటగిరీలోకి రారని వైద్యులు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో గతంలో మెడికల్ బోర్డులు సర్టిఫికెట్ల జారీ చేసిన సమయంలో అవకతవకలు జరిగాయనే వాదన వినిపిస్తోంది. దీనికి అనుగుణంగా సుమారు 160 మంది వరకు



బోర్డు ఎదుట హాజరు కాకపోవడంతో అనుమానాలకు మరింత బలం చేకూరింది. ఉపాధ్యాయుల బదిలీల సమయంలో ప్రాధాన్యత పాయింట్లు ఇవ్వడం ఆనవాయితీ. ఎక్కువ ప్రాధాన్యత పాయింట్లు ఉన్నవారంతా విశాఖ నగరం, పరిసరాలు, అనకాపల్లి చుట్టుపక్కల ఉన్న పాఠశాలల్లో పనిచేస్తున్నారు. తాజాగా జరగనున్న టీచర్ల బదిలీలకు ప్రాధాన్యత పాయింట్ల కోసం గతంలో సమర్పించిన మెడికల్ సర్టిఫికెట్లు చెల్లవని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రాధాన్యత పాయింట్ల కోసం

... మిగతా 6వ పేజీలో

ఖాకీల అవినీతిపై సీపీ సీరియస్!

- రేంజ్ వీఆర్‌కు మల్కాపురం సీఐ
- ఇతర సీఐల అవినీతిపై సీల్డ్ కవర్లు అందజేత
- తగిన వివరణ ఇవ్వాలని ఆదేశించిన శంఖబ్రత బాగ్చి
- నేడో, రేపో పలువురిపై బదిలీ వేటు?

విశాఖపట్నం, మే 18 (ఆంధ్రజ్యోతి):

నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో లంచాలకు పాల్పడడం, విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే అభియోగాలను ఎదుర్కొంటున్న సర్కిల్ ఇన్‌స్పెక్టర్లపై సీపీ శంఖబ్రత బాగ్చి సీరియస్ అయినట్టు తెలిసింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న సీఐలతో శనివారం ఆయన తన చాంబర్‌లో సుదీర్ఘంగా భేటీ



అయ్యారు. ఈ సందర్భంగా ఒక్కో సీఐను పిలిచి వారి స్టేషన్ పరిధిలో మద్యం దుకాణాలు, బార్‌లతో పాటు స్టేషన్‌కు వచ్చే కేసుల్లో వసూళ్లకు సంబంధించిన అంశాలను సీపీ వారికి వివరించి, సమాధానం కోరినట్టు తెలియవచ్చింది. అలాగే ఆయా స్టేషన్ల పరిధిలో సీఐతోపాటు సిబ్బంది పని తీరు, అవినీతికి సంబంధించి తనవద్దకు వచ్చిన వివరాలను ఒక కవరులో పెట్టి వారికి అందజేసినట్టు సమాచారం. వాటిపై తగిన వివరణ ఇవ్వడంతోపాటు ఆరోపణలను సరిదిద్దుకునేందుకు చేపట్టిన చర్యలను తనకు తెలియజేయాలని సీఐలను ఆదేశించినట్టు తెలిసింది. పీఎంపాలెం పోలీస్ స్టేషన్ పరిధికి సంబంధించి బీచ్ రోడ్డులో వాహనచోదకుల నుంచి బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నారనే అభియోగంపై ఆధారాలు లభించడంతో ఆయన్ను వీఆర్‌కు సరెండర్

... మిగతా 6వ పేజీలో



ఇతర రాష్ట్రాలకు మామిడి ఎగుమతి

- భీమిలి నుంచి కోల్‌కతా, న్యూఢిల్లీ తదితర ప్రాంతాలకు మామిడి పండ్లు
- రెండు వందల లారీలతో సరకు రవాణా
- ఇప్పటికే వంద లారీల్లో తరలింపు
- ఏటా రూ. కోటి వ్యాపారం
- ఆరు వేల మందికి ఉపాధి


గంధవరం గ్రామంలో మామిడి కాయలను గ్రేడింగ్ చేస్తున్న రైతులు

భీమునిపట్నం (రూరల్), మే 18 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో మామిడి పంట విస్తారంగా పండడంతో ఇతర ప్రాంతాలకు భారీగా ఎగుమతులు జరుగుతున్నాయి. చాలా మంది రైతులు అలమండ రైల్వేస్టేషన్ నుంచి కోల్‌కత్తా, న్యూఢిల్లీ, తదితర ఉత్తరాది రాష్ట్రాలకు సరకును ఎగుమతి చేస్తున్నారు. ఈ ఏడాది సుమారు రూ.కోటి వరకు వ్యాపారం జరుగుతుందని వ్యాపారులు అంచనా వేస్తున్నారు. ఈ ఎగుమతుల ద్వారా ఆరు వేల మంది ఉపాధి పొందుతున్నారు. ఏటా రెండు వందల లారీలతో మామిడి బుట్టలను రవాణా చేస్తుండగా ఈ ఏడాది ఇప్పటికే వందకు పైగా లారీలతో సరకు రవాణా చేశారు. మరో రెండు వందల లారీలతో మామిడి పండ్ల బుట్టలు రవాణా అవుతాయని అంచనా వేస్తున్నారు.

12 వేల ఎకరాల్లో తోటలు

నియోజకవర్గంలో 12 వేల ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. వీటిని ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు ఏటా లీజుకు తీసుకుంటారు. ఆరు నెలలు ముందే రైతుల వద్దకు వచ్చి అడ్వాన్సులు ఇచ్చి, పెంపకందారులుగా వారినే ఉంచుతారు. కాయలు పక్వానికి వచ్చిన తర్వాత తోటల్లోకి లారీలు తీసుకువచ్చి ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తారు. నియోజకవర్గంలో పద్మనాభం మండలంలో 12 గ్రామాలు, ఆనందపురం మండలంలో 4, భీమిలిలో 8 గ్రామాల్లో ఈసారి పంట దిగుబడి బాగుంది. ఇప్పటికే వందకు పైగా లారీలతో పండ్లు రవాణా చేశారు. మరో రెండు వందల లారీలతో పండ్ల బుట్టలు రవాణా అవుతాయని అంచనా వేస్తున్నారు. వ్యాపారస్తుల నుంచి అడ్వాన్సు తీసుకున్న రైతులు తమ పంట దిగుబడిని ఇతరులకు అమ్మకూడదు. గత పది, పదిహేను ఏళ్ల నుంచి ఒకే వ్యాపారస్తుల నుంచి అడ్వాన్సులు తీసుకుని మామిడి అమ్మకాలు చేస్తున్న రైతులు వందలాది మంది ఉన్నారు. స్థానికంగా ఉన్న చిరు వ్యాపారులు కొందరు రైతుల నుంచి లీజుకు తీసుకుని ఇతర రాష్ట్రాల వ్యాపారస్తులకు అమ్మకాలు చేస్తున్న సందర్భాలు కూడా ఉన్నాయి.

రవాణాకు సిద్ధం

మామిడి కాయలను గతంలో వెదురు బుట్టల్లో రవాణా చేసేవారు. ఇప్పుడు స్థానికంగా రవాణాకు అట్ట పెట్టెలు తయారు చేసి, ఇతర రాష్ట్రాలకు రవాణా చేస్తున్నారు. ఒక పెట్టెలో సుమారు 50 కాయలు వరకు పడతాయి. అట్ట పెట్టెలో నెల రోజుల వరకు సరకు పాడవ్వకుండా ఉంటుంది. ఒక బుట్ట రూ. 500 నుంచి రూ. 1000 వరకు ధర పలుకుతోంది. స్థానికంగా అంత ధర లేకపోవడంతో ఇతర రాష్ట్రాలకు రవాణా చేయడానికే ఎక్కువ మంది మొగ్గు చూపిస్తున్నారు.

అలమండ నుంచి రవాణా

అలమండ రైల్వేస్టేషన్ పద్మనాభం నుంచి చాలా దగ్గర. అది చిన్న స్టేషన్ కావడం వల్ల మామిడి రవాణా అక్కడి నుంచే జరుగుతోంది. ఈ స్టేషన్‌కి ఆనుకుని పద్మనాభం మండలానికి చెందిన గంధవరం గ్రామం ఉంది. ఇతర గ్రామాలు కూడా అందుబాటులో ఉన్నాయి.ఈ ప్రాంతాల్లో మామిడి వేసిన రైతులంతా తమ పంటను ఈ స్టేషన్ నుంచే ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తుంటారు. ఈ స్టేషన్‌లో లారీల నుంచి గూడ్సు పెట్టెల్లోకి బుట్టలను నేరుగా లోడింగ్ చేయడానికి ప్రత్యేకమైన సదుపాయాలున్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి భీమిలి ప్రాంతానికి వచ్చే వ్యాపారులు కూడా ఈ స్టేషన్ నుంచే రవాణా చేయడానికి ఆసక్తి చూపిస్తుంటారు. ఈఏడాది పెద్దగా పొగమంచు లేకపోవడంతో దిగుబడి బాగుందని రైతులు చెబుతున్నారు.

తగరపువలసలో భగవద్గీత ప్రచారం



భగవద్గీత గురించి ప్రచారం నిర్వహిస్తున్న ప్రబోధ సేవాసమితి సభ్యులు

తగరపువలస, మే 18 (ఆంధ్రజ్యోతి) : ప్రబోధ సేవాసమితి సభ్యులు ఆదివారం తగరపువలస, బంగ్లామెట్ట, శ్రీరామనగర్ ప్రాంతాల్లో భగవద్గీత ప్రచారాన్ని నిర్వహించారు. కులాలు, మతాలు అన్న భేదాలు లేకుండా అందరూ సామరస్యంతో మెలగాలని కోరారు. భగవద్గీత గ్రంథం శ్రీకృష్ణుడు సమాజానికి అందించిన అసలైన జ్ఞానమని పేర్కొన్నారు. కార్యక్రమంలో విజయరాంపురం గ్రామానికి చెందిన ప్రబోధ సేవా సమితి సభ్యులు పలువురు పాల్గొన్నారు.

డిప్యూటీ మేయర్ జనసేనదే?

... 5వ పేజీ తరువాయి

ఆయనకే ఈ పదవి లభించవచ్చని ఆ పార్టీ నేతలు అంచనా వేస్తున్నారు. కానీ ఉషశ్రీ కోసం జనసేనలోని కొందరు ప్రజాప్రతినిధులు బలంగా పట్టుబడుతుండడంతో ఆమె కూడా పోటీలో నిలిచినట్టయింది. జనసేనకే ఈ పోస్టును కేటాయించినట్టయితే టీడీపీ నుంచి డిప్యూటీ మేయర్ పదవిని ఆశించిన 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత, 18వ వార్డు కార్పొరేటర్ గొలగాని మంగవేణి, 76వ వార్డు కార్పొరేటర్ గంధం శీనివాసరావులకు నిరాశే మిగిలినట్టవుతుంది. యాదవ మహిళకు డిప్యూటీ మేయర్‌గా అవకాశం కల్పించకపోతే ఆ సామాజిక వర్గం నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురుకావచ్చని పలువురు టీడీపీ కార్పొరేటర్లు అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలిసింది. వైసీపీ నుంచి వచ్చిన వాళ్లకు అవకాశం ఇస్తే మాత్రం తామంతా వ్యతిరేకంగా ఓటేసే అవకాశం లేకపోలేదని వారు హెచ్చరించినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో సోమవారం డిప్యూటీ మేయర్ ఎన్నిక ఎలా జరుగుతుందనే దానిపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఘాట్ రోడ్డులో అంధకారం

భీమునిపట్నం, మే 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఘాట్ రోడ్డులో లైట్లు లేకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. సింహాచలం పుణ్యక్షేత్రాన్ని దర్శించుకున్న భక్తుల్లో చాలా మంది భీమిలిలో చారిత్రక ప్రాధాన్యం ఉన్న సౌమ్యగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని కూడా సందర్శిస్తారు.

ప్రతి శనివారం ఇక్కడ భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. అయితే మెట్ల మార్గంలో విద్యుత్ సదుపాయం ఉన్నా, వాహనాలు కొండపైకి వెళ్లే ఘాట్ రోడ్డులో లైట్లు ఏర్పాటు చేయకపోవడంతో పలువురు ఇబ్బందులు పడుతున్నారు. ఘాట్ రోడ్డు నిర్మించి మూడేళ్లు కావస్తున్నా.. వీధి దీపాలు ఏర్పాటు చేయకపోవడం దారుణమని పలువురు పేర్కొంటున్నారు.

భీమిలి బీచ్‌లో సందర్శకుల సందడి


సందర్శకులతో నిండిన భీమిలి తీరం

కిటకిటలాడుతున్న బీచ్ పరిసరాలు

భీమునిపట్నం, మే 18 (ఆంధ్రజ్యోతి) : భీమిలి సాగరతీరం ఆదివారం సాయంత్రం సందర్శకులు, పర్యాటకులతో కళకళలాడింది. సాగరతీరంలో గాలిమేడ తీరం నుంచి నోవాటెల్ బీచ్ వరకూ సందర్శకులతో నిండిపోయింది. వేసవి ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్న జనం.. సాయంత్రం సముద్రతీరంలో చల్లగాలుల నుంచి ఉపశమనం పొందడానికి అధికసంఖ్యలో తీరానికి తరలివచ్చారు. భీమిలి పరిసర ప్రాంతాలు, నగరం నుంచి, విజయనగరం, శ్రీకాకుళం, ఎస్.కోట ప్రాంతాల నుంచి సందర్శకులు తరలిరావడం, వీరితో బాటు టూరిస్ట్ ట్రావెల్ బస్సులతో పర్యాటకులు కూడా తరలిరావడంతో తీరంలో సందడి నెలకొంది. సముద్రం కూడా ప్రశాంతంగా ఉండడంతో కెరటాలలో ఆనందంగా సందర్శకులు కేరింతలు కొట్టారు. దీంతో బీచ్‌రోడ్ కిటకిటలాడింది. అయితే వాహనాలు నిలుపుడానికి సరైన పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో ఇబ్బంది పడ్డారు.

ఖాకీల అవినీతిపై సీపీ సీరియస్!

... 5వ పేజీ తరువాయి

చేసినట్టు తెలియవచ్చింది.

అదేవిధంగా మల్కాపురం సీఐ విద్యాసాగర్ స్టేషన్‌కు వచ్చిన మహిళను లైంగికంగా వేధించడం, అదే పనిగా ఆమెకు ఫోన్ చేసి ఇబ్బంది పెడుతున్నట్టు ఫిర్యాదు అందడంతో ఆయనను కూడా రేంజ్ వీఆర్‌కు సరెండర్ చేసినట్టు చేసినట్టు సమాచారం.

అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న పలువురు సీఐలపై ఒకటి రెండు రోజుల్లో శంఖబ్రత బాగ్చి బదిలీ వేటు వేసే అవకాశం ఉంది.

ఈ నేపథ్యంలో ఎవరిపై వేటు పడుతుందనే దానిపై పోలీస్ వర్గాల్లో తీవ్రస్థాయిలో చర్చ జరుగుతోంది.

బదిలీల హడావిడి

... 5వ పేజీ తరువాయి

కొందరు మధ్యలో అనకాపల్లి జిల్లాకు వెళ్లి ఏడాదిలో తిరిగి విశాఖ వచ్చి ఇక్కడే కొనసాగుతున్నారు.

ఉపాధ్యాయుల బదిలీలకు మార్గం సుగమం

జిల్లా విద్యాశాఖలో ఉపాధ్యాయుల బదిలీలకు దాదాపు మార్గం సుగమం అయింది. ఇందుకు సంబంధించి ఒకటి రెండు రోజుల్లో షెడ్యూల్ వెలువడనున్నది. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన జరిగే బదిలీల కోసం విద్యాశాఖ జాబితా రూపొందించింది. ఒకేచోట ఐదేళ్లు/ఎనిమిదేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న ఉపాధ్యాయులు సుమారు 2,300 మంది వరకు ఉంటారని అంచనా వేశారు. ఇంకా మరో రెండువేల మంది వరకు బదిలీలు జరుగుతాయని అంటున్నారు.

ఉమ్మడి జిల్లా మొత్తంగా ఐదువేల మంది టీచర్లకు బదిలీలు జరుగుతా యని ఉపాధ్యాయ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. దాదాపు ఎనిమిదేళ్ల తరువాత ఈ పర్యాయం భారీగా బదిలీలు జరుగుతాయని అంచనా వేస్తున్నారు.

హోమియో వైద్య శిబిరంలో 95 మందికి పరీక్షలు


వైద్య శిబిరంలో పాల్గొన్న స్నిగ్ధశ్రీదేవి ఫౌండేషన్ ప్రతినిధులు

భీమునిపట్నం, మే 18 (ఆంధ్రజ్యోతి) : భీమిలిలో కలిగొట్ల స్నిగ్ధశ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత హోమియో వైద్య శిబిరంలో 95 మందికి ఉచిత వైద్య సేవలు అందించారు. చిన్నబజార్ సమీపంలోని డచ్‌రోడ్డులో గల ఆ సంస్థ కార్యాలయంలో ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభించిన ఈ శిబిరం మధ్యాహ్నం ఒంటిగంటన్నర వరకూ సాగింది. ఈ శిబిరంలో ప్రముఖ హోమియో వైద్యులు టి. జగన్నాధరావు, మోహన్‌లు వైద్య సేవలందించారు. ఆ సంస్థ ఛైర్మన్ కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి, ప్రతినిధులు కెఎస్ఎన్‌మూర్తి, కె. చంద్రశేఖర్, కెవి భానోజీరావు, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో ఆధిపత్య పోరు!

... 5వ పేజీ తరువాయి

మూడు కోట్ల రూపాయలను హెచ్‌డీఎస్ అకౌంట్‌కు బదిలీ చేయాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ అడుగుతున్నారు. కానీ అలా చేయవద్దంటూ మరో అధికారి ఒత్తిడి తెస్తున్నట్టు తెలిసింది. ఈ వ్యవహారం గత కొన్ని రోజులుగా నలుగుతున్నా పరిష్కారం మాత్రం లభించడం లేదని చెబుతున్నారు. జీ-1 సెక్షన్‌లో పనిచేసే ఉద్యోగిని మరో సీటుకు మారుస్తూ ఇప్పటికి రెండుసార్లు ఉత్తర్వులు వెలువడ్డాయి. కానీ ఆ ఉత్తర్వులను అమలు కాకుండా మరో అధికారి అడ్డుచెప్పినట్టు తెలుస్తోంది. దీంతో సదరు ఉద్యోగి అక్కడే కొనసాగుతున్నారు.

తాజాగా ఆస్పత్రి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ చాంబర్ వద్ద ప్రత్యేకంగా సీసీ కెమెరాను ఏర్పాటు చేయించారు. ఆయన చాంబర్‌లోకి వెళ్లే ఉద్యోగుల గురించి తెలుసుకునేందుకే దీనిని ఏర్పాటు చేసినట్టు కింది స్థాయిసిబ్బంది పేర్కొంటున్నారు. ఆస్పత్రిలోని వివిధ విభాగాల తనిఖీ సమయంలోనూ ఇద్దరి మధ్య ఆధిపత్య పోరు స్పష్టంగా కనిపిస్తుందని వారంటున్నారు. ఒక ఉన్నతాధికారి చెప్పినట్టు అక్కడి సిబ్బంది చేస్తే.. మరో అధికారి వచ్చి అలా చేయకూడదంటూ ఆదేశిస్తున్నారని చెబుతున్నా రు. కాగా శానిటేషన్, సెక్యూరిటీ పనితీరు సరిగ్గా లేదని ఆస్పత్రి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అనేకసార్లు సమావేశాలు పెట్టి సరిదిద్దుకోవాలని హెచ్చరించారు. ఆ తరువాత కేజీహెచ్ సూపరింటెండెంట్ కూడా వారితో పలు దఫాలు సమావేశాలు నిర్వహించి తన ఆదేశాలు పాటించాలని సూచించినట్టు తెలిసింది. ఆస్పత్రిలో తనకు తెలియకుండా ఏదీ జరగకూడదని సూపరింటెండెంట్ చెబుతుంటే.. తనకు సమాచారం లేకుండా పనులు చేస్తే మాత్రం ఇబ్బందులు తప్పవని అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ హెచ్చరిస్తున్నారు. దీంతో కేజీహెచ్‌లో పని చేసే ఉద్యోగులకు ముందు నుయ్యి, వెనుక గొయ్యి అన్న చందంగా తయారైంది. ఏదైనా పని చేస్తే ఎవరేమంటారో అన్న సందిగ్ధంలో ఉద్యోగులు ఉండడంతో అనేక సేవలపై ప్రభావం పడుతున్నట్టు చెబుతున్నారు. కొన్ని కీలక ఫైళ్లు ముందుకు సాగడంలో అవాంతరాలు ఎదురవుతున్నాయని పేర్కొంటున్నారు.

నోటి దురుసుతనంతో ఇబ్బందులు..

ఒకవైపు ఇద్దరు ఉన్నతాధికారుల ఆధిపత్య పోరుతో ఇబ్బందులు పడుతుంటే.. కేజీహెచ్ ఉన్నతాధికారి నోటి దురుసుతనంతో మరికొంత మంది ఉద్యోగులు ఇక్కట్లకు గురవుతున్నారు. కిందిస్థాయి సిబ్బంది పనితీరును మెరుగుపరిచే క్రమంలో ఆయన వినియోగిస్తున్న భాష కొంత ఎబ్బెట్టుగా ఉంటోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నర్సింగ్ సిబ్బందితో పాటు సెక్యూరిటీ, శానిటేషన్, పలువురు వైద్య సిబ్బందికి ఆయన భాష ఇబ్బందికరంగా ఉంటున్నట్టు చెబుతున్నారు. ఉన్నత స్థానంలో ఉన్న అధికారి మాట్లాడే తీరు ఇదేనా.. అంటూ పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. అంతేకాక ఏదైనా పనిమీద ఆయన వద్దకు వస్తే ఎక్కువ సమయం నిరీక్షించేలా చేస్తున్నారని, దీనివల్ల తమ పనులకు జాప్యం కలుగుతోందని పలువురు ఉద్యోగులు పేర్కొంటున్నారు. కేజీహెచ్‌లో నెలకొన్న పరిస్థితులపై ఉన్నతాధికారులు దృష్టి సారించి వాటిని చక్కదిద్దాలని పలువురు కోరుతున్నారు.

నేత్రపర్వంగా అప్పన్నకు స్వర్ణ సంపెంగల పూజ


ఉభయ దేవేరులతో స్వర్ణ పుష్పాల మధ్య గోవిందుడు

సింహాచలం, మే 18 (ఆంధ్రజ్యోతి): వరాహ లక్ష్మీనృసింహస్వామికి నేత్రపర్వంగా స్వర్ణ సంపెంగల పూజ నిర్వహించారు. ఆదివారం వేకువజామున సుప్రభాతసేవతో మేల్కొలిపి ప్రభాతారాధనలు జరిపారు. ఆలయ పద్మనిధి నుంచి తీసిన స్వర్ణ సంపెంగ పూలను బేడా మండప ప్రదక్షిణ చేశారు. ఉభయ దేవేరులతో కూడిన ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని పలు రకాల ఆభరణాలతో అలంకరించారు. నృసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ అన్ని నామాలకు బంగరు సంపెంగ పూలతో పూజ చేశారు. స్వామివారికి మంత్ర పుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు. అనంతరం అదే వేదికపై ఉదయం 9.30 గంటలకు ఆర్జిత నిత్య కల్యాణాన్ని పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.

సులభ్ కాంప్లెక్స్ పూర్తయ్యేదెన్నడు?


పీఆర్‌ఓ కార్యాలయం వెనుకనూతన సులభ్ కాంప్లెక్స్

సింహాచలం, మే 18 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి భక్తులు ప్రతి నిత్యం అనేక రకాల ఇబ్బందులు ఎదుర్కొంటూనే ఉన్నారు. దానిలో భాగంగా దేవాలయానికి సమీపంలో సరైన సులభ్ కాంప్లెక్స్ లేక వ్యాధిగ్రస్తులు, చంటి పిల్లలు, వృద్ధులు అవస్థలు పడుతున్నారు. చందనోత్సవానికి ముందు ఉత్తర రాజగోపురానికి ఎదురుగా స్వామివారి కేశఖండన శాల వద్ద, దక్షిణ మాడవీధిలో, పీఆర్‌ఓ కార్యాలయం వెనుక భాగాన తాత్కాలిక సులభ్ కాంప్లెక్స్‌లు ఉండేవి. వాటి నిర్వహణ సక్రమంగా లేక తరచూ మరమ్మతులకు గురయ్యేవి. దేవదాయశాఖ కమిషనర్ ఉత్తర్వుల ప్రకారం భక్తులకు మౌలిక వసతుల కల్పనలో భాగంగా శాశ్వత ప్రాతిపదికన సులభ్ కాంప్లెక్స్ నిర్మాణాలను లక్షలాది రూపాయలు వెచ్చించి దేవస్థానం ఇంజినీరింగ్ అధికారులు ప్రారంభించారు. రెండు నెలలు గడుస్తున్నా నేటికీ ఆ పనులు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి.

మెడికల్ సర్టిఫికెట్ల మాయాజాలం!

... 5వ పేజీ తరువాయి

టీచర్లు మరోసారి వైద్యుల ముందు హాజరు కావాలని పేర్కొనడంతో గతనెల 24, 25, 26 తేదీల్లో కేజీహెచ్, ఈఎన్‌టీ, కంటి ఆస్పత్రుల్లో నిర్వహించిన పరీక్షలకు వారు హాజరయ్యారు. ఉమ్మడి జిల్లాలో 600 మంది టీచర్లు 56 శాతం అంతకంటే ఎక్కువ వైకల్యం ఉన్నట్టు గతంలో మెడికల్ బోర్డుల నుంచి సర్టిఫికెట్లు తీసుకుని బదిలీల సమయంలో పాయింట్లు పొందారు. వీరిలో ఎక్కువమంది ఇప్పుడు బదిలీలు కోరుకుంటున్నారు. అందువల్ల 442 మందే వైద్య పరీక్షలకు హాజరయ్యారు. టీచర్లకు సంబంధిత వైద్యులు పరీక్షలు నిర్వహించే సమయంలో పలు రకాల రిపోర్టులను ప్రామాణికంగా తీసుకున్నారు. ఎక్కువగా ప్రైవేటు ఆస్పత్రుల నుంచి తెచ్చిన రిపోర్టులను వైద్యులు క్షుణ్ణంగా పరిశీలించాకే ప్రతి ఉపాధ్యాయుడికి సంబంధించి వైకల్యంపై మెడికల్ బోర్డుకు రిఫర్ చేశారు. వైద్యుల ఎదుట హాజరైన ఉపాధ్యాయులందరూ ప్రాధాన్యత పాయింట్ల కోసమేనని చెప్పనక్కర్లేదు. అయితే వైద్యుల తనిఖీల అనంతరం ఆయా టీచర్ ఇబ్బందులపై రిపోర్టు రాసి మెడికల్ బోర్డుకు నివేదించారు. ఈ నివేదికల మేరకు పలువురు ఉపాధ్యాయులు 'ప్రాధాన్యత కేటగిరీ కిందకు వస్తారని, మరికొందరు రారని బోర్డు స్పష్టం చేసింది'. కాగా కేజీహెచ్ జారీ చేసిన సర్టిఫికెట్‌లో కొన్నింటిపై చేతి రాతతో రాయడం గమనార్హం. అంటే గతంలో ఇచ్చిన రిపోర్టులో ఏమైనా తేడాలున్నాయా? లేదా అప్పటి టీచర్ల ఆరోగ్య పరిస్థితి మేరకు వైద్యులు సర్టిఫికెట్లు జారీ చేశారా.? అన్నది ఎవరూ చెప్పలేని పరిస్థితి. అయితే కొందరి సర్టిఫికెట్ల జారీలో మాత్రం అవకతవకలు జరిగాయని గతంలో పలువురిపై ఫిర్యాదులు వచ్చాయి. గతనెలలో పరీక్షలు నిర్వహించిన వైద్యుల రిపోర్టుల మేరకు రెండు మూడు రోజుల క్రితం కేజీహెచ్, ఈఎన్‌టీ, కంటి ఆస్పత్రి సూపరింటెండెంట్లు విశాఖ జిల్లా విద్యాశాఖాధికారికి సర్టిఫికెట్లను పంపారు. మొత్తం 442 మంది వైద్య పరీక్షలకు హాజరైతే వారిలో సగం మందే ప్రాధాన్యత కేటగిరీలోకి వస్తారని మెడికల్ బోర్డులు ధ్రువీకరించాయి. దీంతో ఈ పర్యాయం బదిలీల్లో ప్రాధాన్యత కేటగిరీలో పాయింట్లు పొంది బదిలీల్లో మంచి స్థానాలు పొందే అవకాశాన్ని కొందరు కోల్పోయారు.

ఈ పర్యాయం బదిలీల్లో ఒక పాఠశాలలో 50 శాతానికి మించి ప్రాధాన్యత కేటగిరీలో టీచర్లు రాకుండా ప్రభుత్వం ఆంక్షలు విధించింది. దీంతో నగరం, పరిసరాల్లో పలు పాఠశాలలకు ఇతర కేటగిరీ టీచర్లు రానున్నారని విద్యాశాఖ వర్గాలు తెలిపాయి.

24, 25 తేదీల్లో బీవీకే కళాశాలలో మామిడి పండ్ల మేళా

విశాలాక్షినగర్, మే 18 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 24, 25 తేదీల్లో సేంద్రియ మామిడి పండ్ల మేళాను మరోసారి విశాలాక్షినగర్ బీవీకే కళాశాలలో ఏర్పాటు చేయనున్నట్లు ప్రకృతి ఆధారిత రైతుల సంఘం జాతీయ నాయకుడు జలగం కుమార స్వామి తెలిపారు. రెండు రోజులుగా నిర్వహిస్తున్న మామిడి పండ్ల మేళా ఆదివారం ముగిసిన అనంతరం ఆయన మాట్లాడారు. సేంద్రియ మామిడి పండ్ల మేళా నగర వాసుల సహకారంతో విజయవంతమైందని చెప్పారు. అరుదైన మామిడి పండ్ల రకాలను మేళాలో ఉంచామని, రసాయనాల ప్రభావం లేని ఫలాలను తెచ్చామన్నారు. విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పేరి రామకృష్ణ మాట్లాడుతూ అనేక రకాల దేశీయ మామిడి కాయలను కాపాడుకోవలసిన బాధ్యత మనపై ఉందని వివరించారు. యువరైతు రుషికుమార్, సంఘం కార్యదర్శి అశోక్ మాట్లాడారు.

పోగొట్టుకున్న బంగారు గొలుసు అప్పగింత


భక్తునికి గొలుసు అందజేస్తున్న పోలీసు

సింహాచలం, మే 18 (ఆంధ్రజ్యోతి): వరాహ లక్ష్మీనృసింహస్వామి కొలువుదీరిన పవిత్ర సింహగిరిపై పెళ్లి చేసుకోవటానికి వచ్చిన ఓ భక్తుడు గొలుసు పోగొట్టుకోగా, దానిని తిరిగి అప్పగించి ఓ కానిస్టేబుల్ తన నిజాయతీని చాటుకున్నారు. దేవస్థానం సిబ్బంది, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. మద్రిపాలెం శ్రీహర్షనగర్ ప్రాంతానికి చెందిన గుండాల సాయి(27), తణుకు వాసి అయిన వధువుతో పెళ్లికి శనివారం రాత్రి సింహగిరి చేరుకున్నారు. ఆదివారం రాత్రి పెళ్లి జరగాల్సి ఉండగా కుటుంబ సభ్యులతో కలిసి అప్పన్నను ఉదయం దర్శించుకున్న అనంతరం తాము బస చేసిన గజపతి సత్రానికి వెళ్లి చూసుకోగా తన చేతికి ఉండాల్సిన బంగారు మండ గొలుసు పోయినట్టు గుర్తించాడు. ఇంతలో దేవస్థానం బ్రాడ్‌కాస్టింగ్ సిస్టమ్ ద్వారా గొలుసు దొరికినట్టు ప్రకటన వచ్చింది. అంతే! పోగొట్టుకున్న పెళ్లికొడుకు సాయి వెళ్లి అది తనదేనని నిర్ధారించుకున్నాడు. సమగ్రపరిశీలన తరువాత దేవాలయ సిబ్బంది సమక్షంలో క్రైమ్ కానిస్టేబుల్ గణేష్ బాధితునికి గొలుసు అందజేశారు.

కళానగర్‌లో పార్కు ప్రారంభం


పార్కును ప్రారంభిస్తున్న ఏడో వార్డు కార్పొరేటర్ పిల్లా మంగమ్మ

మధురవాడ, మే 18 (ఆంధ్రజ్యోతి): కాలనీల్లోని ప్రజలు సేదదీరేందుకు పార్కులు దోహదపడతాయని 7వవార్డు కార్పొరేటర్ పిల్లా మంగమ్మ అన్నారు. వార్డులోని కళానగర్‌లో రూ.48 లక్షల జీవీఎంసీ నిధులతో నిర్మించిన పార్కు, ఓపెన్‌జిమ్‌ను ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు పిల్లా వెంకట్రావు, నాగోతి శివాజీ, కార్యకర్తలు పాల్గొన్నారు.

పుస్తక పఠనంపై అవగాహన అవసరం


విద్యార్థులతో సంభాషిస్తున్న మాస్టర్ పాలెపు బంగారుచిట్టి

సింహాచలం, మే 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పుస్తక పఠనంపై అవగాహన ఉండాలని, తద్వారా విజ్ఞాన సముపార్జన మెరుగుపడుతుందని విశ్రాంత ప్రధాన ఉపాధ్యాయులు పాలెపు బంగారుచిట్టి అన్నారు. అడివివరం శాఖా గ్రంథాలయాధికారి ఎన్వీ నరసింహం సారథ్యంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో ఆదివారం రిసోర్సు పర్సన్‌గా పాల్గొన్న ఆయన పుస్తకాల ఎంపిక, చదివే విధానం తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పుస్తకం ఎంపిక ఎంతో కీలకమని, చదివిన తరువాత అర్థం కాని అంశాలను ప్రత్యేకంగా రాసి ఉంచుకుని, అనుభవజ్ఞులతో సందేహ నివృత్తి చేసుకోవాలన్నారు. నీతి కథలు, మంచిని బోధించే శతక పద్యాలను విద్యార్థులతో చదివించి, వాటి భావాలను విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కేఎస్ఆర్ మూర్తి సోదాహరణంగా వివరించారు.

యాక్ట్స్ డిగ్రీ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు




ప్రాంగణ నియామకాల్లో ఎంపికైన విద్యార్థులతో కళాశాల ప్రతినిధులు

ఎండాడ, మే 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎండాడలో ఉన్న యాక్ట్స్ డిగ్రీ కళాశాల, జేసీఐ వైజాగ్ కింగ్స్ సహకారంతో ఆదివారం ఆ కళాశాల ప్రాంగణంలో జాబ్ మేళా నిర్వహించారు. 274 మంది యువతీ యువకులు పాల్గొనగా 140 మందిని పలు రకాల ఉద్యోగాలకు కంపెనీలు ఎంపిక చేసినట్టు ప్రిన్సిపాల్ ఎం.పద్మారావు పేర్కొన్నారు. కళాశాల ఛైర్మన్ బి.రాజారావు, కార్యదర్శి జేవీ ప్రభాకరరావు, ఉపాధ్యక్షుడు పి.అంబేడ్కర్, జేసీఐ కింగ్స్ వైజాగ్ అధ్యక్షుడు జి.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఉద్యోగాలకు ఎంపికైనవారిని అభినందించారు.

రేపటి నుంచి కాంట్రాక్టు కార్మికుల నిరవధిక సమ్మె

ఉక్కుటౌన్‌షిప్, మే 18 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటులో కాంట్రాక్టు కార్మికుల తొలగింపును నిరసిస్తూ ఈ నెల 20 నుంచి కాంట్రాక్టు కార్మికులు నిరవధిక సమ్మెకు దిగుతున్న నేపథ్యంలో యాజమాన్యం అప్రమత్తమైంది. ప్లాంటులో సుమారు 13 వేల మంది కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారు. వీరిలో 1,750 మందిని ఉక్కు యాజమాన్యం తొలగించిన సంగతి తెలిసిందే. అలాగే ఆయా కాంట్రాక్టు సంస్థల టెండర్ల గడువు పూర్తి కావడం... వాటిని మళ్లీ పిలవకపోవడంతో ఆయా కాంట్రాక్టర్‌ల వద్ద పనిచేస్తున్న సుమారు వెయ్యి మంది విధులకు దూరమయ్యారు. కాంట్రాక్టు కార్మికులను తొలగించరాదని ప్లాంట్ యాజమాన్యానికి గతంలో సమ్మె నోటీసు ఇవ్వడం, ఆర్‌ఎల్‌సీ సమక్షంలో చర్చలు జరిగినా ఎటువంటి పురోగతి లేకపోవడంతో ఒకరోజు సమ్మెకు వెళ్లారు. అయినప్పటికీ యాజమాన్యంలో ఎలాంటి మార్పు కానరాకపోవడంతో అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు సమావేశమై నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చారు. దీనిని విరమించుకోవాలని యాజమాన్యం కార్మిక నాయకులకు సూచించగా, సమస్యలు పరిష్కరించే వరకు పోరాటాలు చేస్తామని వారు స్పష్టం చేశారు.



విరమించాలని కోరిన స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం

సమస్యలను పరిష్కరించేంత వరకు పోరాటాలను ఆపేది లేదన్న అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు

ఇవీ కాంట్రాక్టు కార్మికుల ప్రధాన సమస్యలు

- ఉక్కు కర్మాగారంలో ఒక్క కాంట్రాక్టు కార్మికుడిని కూడా ఇకపై విధుల నుంచి తొలగించరాదు.
- టెండర్ల ప్రక్రియ ముగిసిన కాంట్రాక్టర్ల వద్ద పనిచేసిన కార్మికులకు మరోచోట ఉపాధి కల్పించాలి.
- 60 ఏళ్లు నిండిన కార్మికులకు ఆర్థిక భరోసా కల్పించాలి.
- పాత పద్ధతిలోనే గేటు పాసులు మంజూరు చేయాలి.
- కనీస వేతనాను చెల్లించడంతో పాటు ప్రమాద ఎక్స్‌గ్రేషియాను రూ.30 లక్షలకు పెంచాలి.
- ఎనిమిది గంటల పని దినాలను అమలు చేయాలి.
- ఈఎస్‌ఐ ద్వారా మెరుగైన వైద్య సేవలందించాలి.
- ప్రమాదం జరిగిన చోట నుంచి ఈఎస్‌ఐ రిఫర్ చేసిన ఆస్పత్రి వరకు అంబులెన్స్ సౌకర్యం కల్పించాలి.
- కార్మికుల నైపుణ్యతను బట్టి డిజిగ్నేషన్లలో మార్పులు చేయాలి.
- పెండింగ్‌లో ఉన్న ఫుల్ అండ్ ఫైనల్‌ను యాజమాన్యం చెల్లించాలి.
- ఖాళీ అయిన పోస్టులను నిర్వాసితులతో భర్తీ చేయాలి.




స్టీల్‌ప్లాంటులో నేలపాలైన ద్రవపు ఉక్కు

300 టన్నుల 'ఉక్కు' ద్రవం నేలపాలు

ఉక్కుటౌన్‌షిప్, మే 18 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్ ఫర్నేస్-2లో సుమారు మూడు వందల టన్నుల ద్రవపు ఉక్కు నేలపాలయింది. ఇందుకు సంబంధించి విభాగం ఉద్యోగులు తెలిపిన వివరాల ప్రకారం....బ్లాస్ట్ ఫర్నేస్ నుంచి టర్పో ల్యాడిల్ కార్ (టీఎల్‌సీ)లోకి ద్రవపు ఉక్కును నింపి, దీనిని ఎస్‌ఎంఎస్ (స్టీల్ మెల్ట్‌షాప్)కు తరలిస్తుంటారు. ఈ క్రమంలో టీఎల్‌సీకి రంధ్రం పడడంతో ద్రవపు ఉక్కు నేలపాలైంది. సమాచారం అందుకున్న స్టీల్‌ప్లాంట్ ఫైర్ విభాగం సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ట్రాక్‌పై పడిన ద్రవపు ఉక్కును తొలగింపు, లాడిల్ కార్‌ను పక్కకు తొలగించారు. ఈ ప్రమాదంలో ట్రాక్ దెబ్బతినడం, కేబుల్స్ కాలిపోవడం తప్ప ఎవరికీ హానీ కలగలేదు.

వర్షంతో చల్లబడిన నగరం



ఆదివారం రాత్రి వర్షంలోనే వాహనాలపై వెళుతున్న నగరవాసులు

విశాఖపట్నం, మే 18 (ఆంధ్రజ్యోతి): భానుడి భగభగలతో అల్లాడుతున్న నగరవాసులకు సాంత్వన చేకూర్చేలా నగర పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆదివారం రాత్రి వర్షం కురిసింది. రాత్రి 8.30 గంటల సమయంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయి మేఘావృతమైంది. అనేక ప్రాంతాల్లో చిరుజల్లులతో కూడిన వర్షం ప్రారంభమైంది. సుమారు 15 నిమిషాల నుంచి అరగంటపాటు చిరు జల్లులతో కూడిన వర్షం కురవడంతో వాతావరణం కాస్త చల్లబడింది. గత కొన్ని వారాలుగా ఎండ తీవ్రత, ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలకు తాజాగా కురిసిన వర్షంతో ఉపశమనం లభించినట్టయింది. కొన్నిచోట్ల గాలులతో కూడిన వర్షం కురవగా, అనేక ప్రాంతాల్లో చిరుజల్లులు మాత్రమే కురిశాయి. కాగా ఆదివారం ఉదయం నుంచే వాతావరణం చల్లదనంగా ఉంది. అనేక ప్రాంతాల్లో మేఘావృతమై ఉండడంతో ప్రజలకు ఎండ బాధలు కాస్త తప్పాయి. ఎండ లేకున్నా ఉక్కపోత వేధించడంతో నగరవాసులు కాస్త ఇబ్బందులకు గురయ్యారు.

నేడు, రేపు నీటి సరఫరాకు అంతరాయం

అగనంపూడి, మే 18 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 79, 85 వార్డుల పరిధిలో సోమ, మంగళవారాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని వాటర్ సప్లై విభాగం ఏఈ పి.కేథార్‌నాథ్ తెలిపారు. పినమడక వద్ద ప్రధాన పైపులైన్‌కు మరమ్మతులు చేపడుతున్నందున నీటి సరఫరాకు అంతరాయం వాటిల్లుతుందన్నారు. ఈ కారణంగా అగనంపూడి, గల్లవానిపాలెం, బీసీ కాలనీ, ఉప్పలకాలనీ, అట్టవానిపాలెం, ఫార్మాసిటీ కాలనీ, ఇ-మర్రిపాలెం, మంత్రిపాలెం, గంజిపేట, గొల్లపేట, గంగిరెడ్ల కాలనీ, శ్రీరామ్‌నగర్, వినాయకనగర్, హౌసింగ్ కాలనీ, ప్రాంతాల్లో నీటి సరఫరాను నిలిపివేస్తున్నట్టు పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తామన్నారు. ఈ విషయాన్ని ప్రజలంతా గుర్తించి తమకు సహకరించాలని ఆయన కోరారు.

జాయ్‌జెమీమియా కేసులో కీలక ముఠా సభ్యుడి అరెస్టు

విశాఖపట్నం, మే 18 (ఆంధ్రజ్యోతి): నగరంలో సంచలనం సృష్టించిన జాయ్ జమీమియా కేసులో కీలక ముఠా సభ్యుడిని భీమిలి పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. దీంతో ఈ కేసులో ఇప్పటి వరకు అరెస్టయినవారి సంఖ్య నాలుగుకు చేరింది. ప్రేమ పేరుతో పలువురు యువకులు, సంపన్న కుటుంబాలకు చెందిన వారిని లోబరుచుకుని, వారితో ఏకాంతంగా ఉన్నపుడు ఫొటోలు, వీడియోలు తీయడం, మత్తు మందు ఇచ్చి వారిని నగ్నంగా మార్చి ఫొటోలు, వీడియోలు తీసి కంచరపాలేనికి చెందిన జాయ్‌జెమీమియా నిలువుదోపిడీ చేసిన విషయం తెలిసిందే. జాయ్‌జెమీమియా ఆగడాలపై నగరంలోని పలుపోలీస్‌స్టేషన్లలో బాధితులు ఫిర్యాదు చేయగా, కేసులు నమోదు చేసిన పోలీసులు జాయ్‌జెమీమియాతో పాటు ఆమెకు సహకరించిన ముఠా సభ్యులు పలువురిని అరెస్టు చేసి కొన్నాళ్ల కిందట రిమాండ్‌కు పంపించారు. తాజాగా ఎన్‌ఏడీ ప్రాంతానికి చెందిన పొలమరశెట్టి రత్నరాజు (46) జాయ్‌జెమీమియాతో ఆర్థిక లావాదేవీలు భారీ మొత్తంలో జరిపినట్టు పోలీసులు గుర్తించారు. దీంతో మురళీనగర్ పాస్‌పోర్టు కార్యాలయంలో సమీపంలోని భవనంలో గ్లోబల్ ఐటీసీ కంపెనీ సీఈవోగా పని చేస్తున్నట్టు గుర్తించిన పోలీసులు ఆయన్ని ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ తిరుమలరావు తెలిపారు.

వడదెబ్బపై అవగాహన

కూర్మన్నపాలెం, మే 18 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87వ పరిధి తిరుమల నగర్‌లో ఆదివారం కాలనీ అసోసియేషన్, ప్రజారోగ్య విభాగం ఆధ్వర్యంలో వడదెబ్బ తగలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ అప్పారావు, ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎం, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వడదెబ్బ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున ముఖ్యమైన పనులుంటేనే ఇళ్ల నుంచి బయటకు వెళ్లాలని, ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఇళ్లలో లేదా నీడ ఉన్నచోట ఉండాలని, మంచినీళ్లు, కొబ్బరిబొండాలు, మజ్జిగ, ఓఆర్ఎస్‌ను తాగాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు జి.విశ్వేశ్వరరావు నాగభూషణం, పరమానందం, పరమేశ్వరరావు, సన్యాసిరావు, వసంతరెడ్డి, పార్వతి, స్వాతి, రాజు, ఉదయశంకర్, మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **మిషన్ ఇంపాజిబుల్** : జగదాంబ
- **ఫైనల్ డెస్టినేషన్** : శారద
- **సింగిల్** : మెలోడి, శరత్, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సప్తగిరి (తగరపువలస)
- **శుభం**: శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)
- **హిట్3**: సంగం, శ్రీరామ, శ్రీలీలామహల్, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 14, వంకాయలు (తెలుపు) 38, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 20, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 36, బీరకాయలు 36, ఆనపకాయ 16,కాలీఫ్లవర్ 32, క్యాబేజీ 15, క్యారెట్ 38 దొండకాయలు 24, బంగాళదుంపలు 19, అరటికాయ (పె)9, మునక్కాడలు (కిలో) 60, అల్లం (పాతది)50, బరబాటి 22, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 100, బద్దచిక్కుడు 44, దోస కాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరి కాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 98, కీరదోస 32, కాప్సికమ్ 48, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడ దుంపలు 36,కంద 74, దేముడు చిక్కుడు 64, గోరుచిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, బూడిదగుమ్మడికాయ 20, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	545
విజయనగరం	549
శ్రీకాకుళం	549

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	110
లైవ్ ధర	130
విత్ స్కిన్	230
స్కిన్‌లెస్	240

సత్తా చూపిన త్రివిధ దళాలు

కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ

ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన నేపథ్యంలో తీరంలో ఘనంగా తిరంగా ర్యాలీ

విశాఖపట్నం/బీచ్ రోడ్డు, మే 18 (ఆంధ్రజ్యోతి):

పహల్గాం ఉగ్రదాడి తరువాత పాకిస్థాన్‌లోని ఉగ్రవాదుల శిబిరాలను ధ్వంసం చేసేందుకు చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతం చేసి భారత త్రివిధ దళాలు తమ సత్తాను చాటాయని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన నేపథ్యంలో ఆదివారం సాయంత్రం బీచ్ రోడ్డులో తిరంగా ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీలో నగర పరిధిలోని అనేక ప్రాంతాలకు చెందిన ప్రజలు, విద్యార్థులు, మాజీ సైనిక ఉద్యోగులు, వివిధ మతాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. ప్రతిఒక్కరూ జాతీయ జెండాను చేతపట్టుకుని భారత్ మాతాకీ జై.. అంటూ నినాదాలు చేశారు. భారత సైనికుల త్యాగాలను ఈ సందర్భంగా అందరూ గుర్తు చేసుకున్నారు. అమరులైన సైనికులను స్మరించుకుంటూ వీర జవాన్లు అమర్ రహే అంటూ నినదించారు. భారీ త్రివర్ణ పతాకాన్ని తిరంగా ర్యాలీ వెంబడి ప్రదర్శించారు.

ర్యాలీలో పాల్గొన్న కేంద్ర మంత్రి మాట్లాడుతూ పహల్గాంలో పర్యాటకులపై విచక్షణారహితంగా ఉగ్రవాదులు కాల్పులు జరిపి భార్యల కళ్లెదుటే వారి భర్తలను హతమార్చడం దారుణమన్నారు. అటువంటి దుర్మార్గులకు ఆపరేషన్ సిందూర్ పేరుతో ప్రధాని నరేంద్ర మోదీ గట్టిగా బుద్ధి చెప్పారన్నారు. పాకిస్థాన్‌లోని ఉగ్రమూకల స్థావరాలపై దాడులు నిర్వహించి వారిని మట్టుబెట్టారన్నారు. భారత్ చేపట్టిన దాడి, సైనిక సామర్థ్యాలను చూసి అనేక దేశాలు ఆశ్చర్యపోయాయన్నారు. ఆపరేషన్ సిందూర్‌తో భారత త్రివిధ దళాల శక్తి సామర్థ్యాలు ఏమిటో ప్రపంచానికి తెలియడంతోపాటు అనేక దేశాలు ప్రశంసలు కురిపిస్తున్నాయని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో అశువులుబాసిన వీరసైనికులకు దేశమంతా నివాళులు అర్పిస్తోందని, ఈ ర్యాలీలో పాల్గొన్న జనమే వారిలో దాగివున్న దేశభక్తికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, పి.విష్ణుకుమార్‌రాజు, పి.గణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, పంచకర్ల రమేశ్‌బాబు, మేయర్ పీలా శ్రీనివాసరావు, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, మాజీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరశురామ్, పీవీఎన్ మాధవ్, నాగేంద్ర, పసుపులేటి ఉషాకిరణ్, పలువురు కార్పొరేటర్లు, అధిక సంఖ్యలో ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యేలు గణబాబు, విష్ణుకుమార్‌రాజు, వెలగపూడి, తదితరులు



గోపాలపట్నంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఎమ్మెల్యే గణబాబు ఆధ్వర్యంలో..

గోపాలపట్నం: ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన నేపథ్యంలో పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ ఆదివారం సా యంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ ప్రధాని మోదీ ప్రజల మనోభావాలు, ఆకాంక్షలకు అనుగుణంగా భారత సైనం పాకిస్థాన్‌కు గట్టి సమాధానం చెప్పిందని అన్నారు. అనంతరం వీర జవానులకు ఘనంగా నివాళులర్పించారు. ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొని సెలవుపై నగరానికి వచ్చిన సైనికులను సన్మానించారు. గోపాలపట్నం నుంచి ఎన్‌ఏడీ జంక్షన్ వరకూ తిరంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, అధికారులు, కూటమి నేతలు, కార్యకర్తల, ఎన్‌సీసీ విద్యార్థులు, మాజీ సైనికులు పాల్గొన్నారు.

ఎన్.ఎ.డి.జంక్షన్: కూటమి నాయకులు నిర్వహించిన తిరంగా యాత్ర ఎన్‌ఏడీ జంక్షన్ ఫైఓవర్ వద్ద ముగిసింది. ఈ యాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ పహల్గాంలో అమాయక పర్యాటకులను ముట్టబెట్టిన ఉగ్రవాదులకు ఆపరేషన్ సిందూర్‌తో మనసైనికులు గట్టిగా బుద్ధి చెప్పినట్టు తెలిపారు. యాత్రలో పార్టీలకు అతీతంగా యువకులు, వృద్ధులు, మాజీ సైనికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



నూతన కమిటీతో టీడీపీ నాయకులు

టీడీపీ 75వ వార్డు అధ్యక్షుడిగా నమ్మి అప్పారావు

గాజువాక, మే 18 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ 75వ వార్డు అధ్యక్షుడిగా నమ్మి అప్పారావు నియమితులయ్యారు. ఇక్కడి టీడీపీ కార్యాలయంలో పార్టీ పరిశీలకుడు ఎంవీఎస్ చౌధరి, నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నమ్మి అప్పారావు, ప్రధాన కార్యదర్శిగా దొమ్మేటి పెరుమాళ్లు, క్లస్టర్ ఇన్‌చార్జిగా దొమ్మేటి అప్పారావు, కార్యవర్గ సభ్యులుగా పలువురిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో తెలుగు యువత ప్రధాన కార్యదర్శి మొల్లి పెంటిరాజు, నాయకులు పులి సురేశ్‌రెడ్డి, ఎం.పెంటయ్య, సింహాద్రి, శ్రీను, సన్యాసమ్మ, పుష్ప, తదితరులు పాల్గొన్నారు.

బాలింతలు పోషకాహారాన్ని తీసుకోవాలి

కూర్మన్నపాలెం, మే 18 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 88వ వార్డు యాదవ జగ్గరాజుపేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో మహిళా సంక్షేమశాఖ, సృజన వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రక్తహీనతను అరికట్టడంలో పోషకాహారాల పాత్ర అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కో-ఆర్డినేటర్ జ్యోతిశ్రీ మాట్లాడుతూ బాలికలు, బాలింతలను రక్తహీనత సమస్య వెంటాడుతోందని, దీనిని అధిగమించేందుకు ఎటువంటి పోషకాహారాన్ని తీసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ సభ్యులు శ్రీలక్ష్మి, శ్రావణి, దివ్య, కాపుజగ్గరాజుపేట, యాదవజగ్గరాజుపేట, పకీరుతఖ్యా ప్రాంతాల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పెదమడకలో ఉచిత వైద్య శిబిరం

అగనంపూడి, మే 18 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి పెదమడక కమ్యూనిటీ హాల్ వద్ద ఆదివారం ఫోర్ ఎస్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన టీడీపీ వార్డు నాయకుడు ఇల్లపు ప్రసాద్ మాట్లాడుతూ ఉక్కు నిర్వాసిత గ్రామాల్లో ఉచితంగా శిబిరాలను ఏర్పాటు చేసి వైద్య సేవలందించడం అభినందనీయమన్నారు. అనంతరం వైద్యులు పలువురు రోగులను పరీక్షించి మందులు అందజేశారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళం

అగనంపూడి, మే 18 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్న 1993-94 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానికంగా సమావేశమయ్యారు. 31 ఏళ్ల తరువాత అంతా ఒకచోట కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకుని, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఎవరెవరు ఏఏ రంగాల్లో స్థిరపడింది, పిల్లల చదువులు, పెళ్లిళ్ల గురించి ముచ్చట్లాడుకున్నారు. పాతజ్ఞాపకాలను నెమరువేసుకోవడంత పాటు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు బలిరెడ్డి నాగేశ్వరరావు, మింది కన్నారావు, జి.శ్రీను, జె.సూరిబాబు, మామిడి శ్రీను, పైడిరాజు, ప్రసాద్, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

జనసేన సభ్యత్వ కార్డుల అందజేత

అగనంపూడి, మే 18 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి మినీ జగదాంబ జంక్షన్ వద్ద ఆదివారం జనసేన క్రియాశీలక సభ్యత్వ కార్డులను జనసైనికులు, వీరమహిళలకు పార్టీ వార్డు అధ్యక్షుడు గవర సోమశేఖర్ ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన క్రియాశీలక సభ్యుల సంక్షేమానికి పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ ఎంతో కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు పి.వసంతరావు, ఎన్.గోవింద్, ఎం.రామకృష్ణ, వి.నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా లారీ డ్రైవర్ మృతి

లంకెలపాలెం, మే 18 (ఆంధ్రజ్యోతి) : అనుమానాస్పదంగా ఓ ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్ మృతి చెందాడు. జాతీయ రహదారి లంకెలపాలెం పెట్రోల్ బంకు వద్ద చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలివి. శ్రీకాకుళం జిల్లా జి.సిగడాం మండలం బాతువ ప్రాంతానికి చెందిన పాంగ్రంగి చిన్నారావు (40) ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. విశాఖపట్నం వెంకోజీపాలెంలో కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. కాకినాడలో ఆయిల్ అన్‌లోడ్ చేసి బయల్దేరి, పరవాడ మండలం లంకెలపాలెం పెట్రోల్ బంకు వద్ద శనివారం రాత్రి వాహనాన్ని పార్కింగ్ చేశాడు. ఆది వారం ఉదయానికి అతడు తన ట్యాంకర్ వాహనం పక్కనే విగతజీవిగా పడి ఉన్నాడు. ఇది గుర్తించిన స్థానికులు పరవాడ పోలీసులకు సమాచారం అందిం చారు. వెంటనే వారు వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. అయితే మృతదేహంపై ఎలాంటి గాయాలు లేవని, అనారోగ్యం కారణంగానే మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

మహిళలకు కోరమాండల్ చేయూత



మహిళలతో కోరమాండల్ అధికారులు

మల్కాపురం, మే 18 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 58వ వార్డు పరిధి పలు గ్రామాలలో మహిళల వ్యాపారాభివృద్ధికి కోరమాండల్ ఎరువుల కర్మాగారం ఆర్థిక సాయం అందించేందుకుముందుకువచ్చింది. ఈ నేపథ్యంలో కోరమాండల్ రిక్రియేషన్ క్లబ్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో కోరమాండల్ అధికారులు పాల్గొని మాట్లాడారు. తమసంస్థ సేవా కార్యక్రమాల్లో భాగంగా 30 మంది మహిళలకు వివిధ రిఫ్రిజరేటర్స్, రెండు జూట్ మిషన్లు, టైలరింగ్ మిషన్లు, జిగ్‌జాగ్ మిషన్‌లు నాలుగు, ఫ్లోర్ మిషన్లు తదితర పరికరాలను అందజేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో కోరమాండల్ కంపెనీ యూనిట్‌హెడ్ జ్ఞానసుందరం, డీజీఎం హెచ్‌ఆర్ రెడ్డిపల్లి శ్రీనివాసరావు, సీఎస్‌ఆర్ హెడ్ జయగోపాల్, సీఎస్‌ఆర్ డిప్యూటీమేనేజర్ శేషపు వెంకటరమణ, వాసవ్య మహిళ మండలి ప్రతినిధి మాధవి తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధులను స్ఫూర్తిగా తీసుకోవాలి

మల్కాపురం, మే 18 (ఆంధ్రజ్యోతి): గాంధీజీ, పటేల్, నేతాజీ, అంబేద్కర్, భగత్ సింగ్ తదితర స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను బాలలు స్ఫూర్తిగా తీసుకోవాలని కార్మిక నాయకుడు సత్యానందం పేర్కొన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భారత స్వతంత్ర్య సంగ్రామం జరిగిన తీరును కథల రూపంలో ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి అజేయ్‌కుమార్ పాల్గొన్నారు.

సంవిధాన్ బచావో అభియాన్ ర్యాలీ



ర్యాలీ చేపడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

మల్కాపురం, మే 18 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో సంవిధాన్ బచావో అభియాన్ రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ ఆదివారం మల్కాపురంలలో జరిగింది. ఈ సందర్భంగా పాల్గొన నాయకులు సంబంధిత బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ జనరల్ సెక్రటరీ గాధం మహేశ్, విశాఖ మహిళ నాయకురాలు ఎం.లక్ష్మి, యువజన్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ పి.శివ, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు సతీష్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

కొడుకు చెంతకు తల్లి



బందోను కుమారుడికి అప్పగిస్తున్న దృశ్యం

పెందుర్తి, మే 18(ఆంధ్రజ్యోతి): ఓ మహిళను తన కుమారుడి చెంతకు చేర్చి స్థానిక పోలీసులు మానవత్వం చాటారు. స్థానిక సీఐ కేవీ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాలివి. స్థానిక పోలీసు స్టేషన్ పరిధి గొల్లవిల్లిపాలెంలో ఓ మహిళ అనాథగా సంచరిస్తున్నట్టు సీఐకి సమాచారం రావడంతో ఆయన బ్లూకోట్ కానిస్టేబుల్ చంద్రశేఖర్‌ని అక్కడికి పంపి సురక్షితంగా ఆమెను అనాథ ఆశ్రమానికి తరలించి వారిసంరక్షణలో ఉంచారు. ఆమె కోలుకోవడంతో వివరాలు రాబట్టారు.అరకుకు చెందిన మర్రి కామేశ్వరరావు తల్లి బందోగా ఆమెను గుర్తించారు. సీఐ ఆదేశాలతో ఆదివారం లయోలా వృద్ధాశ్రమం సంరక్షణలో ఉంటున్న ఆమెను కుమారుడికి బ్లూ కోట్ చంద్రశేఖర్ అప్పగించారు. ఉపాధి కోసం నగరానికి వచ్చి మతిస్థిమితం లేక తప్పిపోయినట్టు సీఐ తెలిపారు. 18పెన్2 తల్లిని కుమారుడు చెంతకు చేర్చిన పోలీసులు

మహానాడును విజయవంతం చేయాలి

పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు



మినీ మహానాడు కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం, మే 18 (ఆంధ్రజ్యోతి): కడపలో ఈ నెల 27 నుంచి జరగనున్న మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు పిలుపునిచ్చారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో మినీ మహానాడు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ కార్యకర్తలే పార్టీకి విజయసారథులని కొనియాడారు. గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పార్టీకి అఖండ విజయాన్ని అందించిన ఘనత కార్యకర్తలదేనని కొనియాడారు. ఇదే స్ఫూర్తితో పార్టీని బలోపేతం చేసి మరిన్ని విజయాలు సాధించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఇటీవల మృతి చెందిన పార్టీ కార్యకర్తలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో నియోజవకర్గంలోని కార్పొరేటర్లు, వార్డు కమిటీ సభ్యులు, మహిళా కమిటీ సభ్యులు, అనుసంధ సంస్థల సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రశాంతంగా జేఈఈ అడ్వాన్స్‌డ్

పెందుర్తి, మే 18 (ఆంధ్రజ్యోతి): చినముషిడివాడలోని ఐయాన్ డిజిటల్ కేంద్రంలో ఆదివారం జేఈఈ అడ్వాన్స్‌డ్ ప్రశాంతంగా జరిగింది. రెండు విడతలుగా జరిగిన ఈ పరీక్షకు సుమారు 400 మంది విద్యార్థులు హాజరైనట్టు కేంద్రం నిర్వాహకులు తెలిపారు, సీఐ కేవీ సతీశ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు.

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్‌లో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఐయాన్ డిజిటల్ జోన్‌లో జేఈఈ అడ్వాన్స్‌డ్ ప్రశాంతంగా జరిగింది. పరీక్ష కేంద్రానికి ఉదయం ఏడు గంటలకే అభ్యర్థులతో పాటు తల్లిదండ్రులు రావడంతో ఈ ప్రాంతంలో సందడి వాతావరణం నెలకొంది. విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాతే నిర్వాహకులు లోపలకు అనుమతించారు. వాచీలు, ఎటువంటి ఎలక్ట్రానిక్ వస్తువులు, పెన్సిల్, పెన్నులను అనుమతించలేదు. విద్యార్థినులు ఎవరూ ఉంగరాలు, చెవి దుద్దులు, చైన్లు వేసుకోకుండా చూశారు. కొందరు వాటిని ధరించగా నిర్వాహకులు తీసివేయించాకే లోపలకు అనుమతించారు



ఒకేతాటిపైకి రాష్ట్ర కబడ్డీ సంఘాలు

- క్రీడాకారుల భవిష్యత్తు కోసం కలిసి సాగుతాం: వెంకటరెడ్డి
- నేర కార్యకలాపాలకు పాల్పడిన శ్రీకాంత్‌పై శాప్‌కు ఫిర్యాదు

విశాఖపట్నం స్పోర్ట్స్, మే 18 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సమాంతర సంఘాల పోరు లేకుండా ఆంధ్రప్రదేశ్‌లో ఒకే కబడ్డీ సంఘం ఉండాలన్న ఉద్దేశంతో అందరం కలిసి ముందుకు వెళ్లేందుకు సుముఖంగా ఉన్నట్టు రాష్ట్ర కబడ్డీ సంఘం (రెండో సంఘం) అధ్యక్షుడు జి.వెంకటరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం విశాఖపట్నం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గతంలో కేఈ ప్రభాకర్, వీర లంకయ్య అధ్యక్ష, కార్యదర్శులుగా వ్యవహరిస్తున్న రాష్ట్ర కబడ్డీ సంఘానికి సమాంతరంగా మరో సంఘం ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పకుండా శ్రీకాంత్ అనే వ్యక్తి తనను తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ రకాల జిల్లా కబడ్డీ సంఘాల పేరుతో సమాంతర రాష్ట్ర కబడ్డీ సంఘం ఏర్పాటు చేసిన సంగతి తెలియలేదని, దీంతో ఆ సంఘానికి తాను అధ్యక్షునిగా, శ్రీకాంత్ కార్యదర్శిగా వ్యవహరించామన్నారు. ఈ నేపథ్యంలో శ్రీకాంత్ అనేక అనైతిక, ఆర్థిక, నేర కార్యకలాపాలకు పాల్పడిన విషయాన్ని గుర్తించి నిలదీశానన్నారు. గతంలో కృష్ణా జిల్లా కబడ్డీ సంఘం కార్యదర్శిగా కూడా శ్రీకాంత్ అనేక అవకతవలకు పాల్పడినట్టు తన దృష్టికి రావడంతో క్రీడాకారుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పరిష్కారానికి కృషి చేశానన్నారు. దీనిలో భాగంగా ఇటీవల రాష్ట్ర కబడ్డీ సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించి శ్రీకాంత్ అక్రమాలు, నేర వ్యవహారాలపై ప్రశ్నించామన్నారు. దీనిపై అతడు ఎటువంటి సమాధానం ఇవ్వకుండా, కొద్ది రోజుల తర్వాత కొందరితో అనధికారికంగా సమావేశం నిర్వహించి రాష్ట్ర సంఘాన్ని కబ్జా చేసే ప్రయత్నం చేశాడని ఆరోపించారు. ఈ విషయాన్ని ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ రవినాయుడు దృష్టికి తీసుకువెళ్లానని వెంకటరెడ్డి తెలిపారు. ఇటువంటి వ్యక్తుల వ్యవహార శైలి క్రీడాకారుల భవిష్యత్తుకు ఆటంకంగా మారుతున్నట్టు గుర్తించి, విశాఖ దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అధ్యక్షునిగా ఉన్న రాష్ట్ర సంఘానికి తన మద్దతు తెలిపానని స్పష్టం చేశారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న విశాఖ దక్షిణ ఎమ్మెల్యే, కబడ్డీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్, చిత్రంలో మరో సంఘం అధ్యక్షుడు వెంకటరెడ్డి తదితరులు

శ్రీకాంత్ నేర కార్యకలాపాలపై విచారణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

వైసీపీ ప్రభుత్వ పెద్దల అండతో సమాంతర రాష్ట్ర సంఘం ఏర్పాటు చేయడమే కాకుండా క్రీడాకారుల భవిష్యత్తుతో ఆటలాడుకున్న శ్రీకాంత్ నేర కార్యకలాపాలపై విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని కోరనున్నట్టు విశాఖ దక్షిణ ఎమ్మెల్యే, రాష్ట్ర కబడ్డీ సంఘం అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్ తెలిపారు. శ్రీకాంత్ అక్రమాలపై ఇటీవల శాసనసభలో కూడా మాట్లాడానని, కచ్చితంగా అతనిపై చర్యలు తీసుకునేలా ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థపై ఒత్తిడి తెస్తామన్నారు. వెంకటరెడ్డి నిర్ణయంతో రాష్ట్రంలో కబడ్డీకి ఒకే సంఘం వుండడం శుభ పరిణామమని అన్నారు. ఈ సమావేశంలో కబడ్డీ సంఘాల ప్రతినిధులు వీర లంకయ్య, ఉరుకూటి శ్రీనివాసరావు, ప్రసాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలిండియా పోటీలకు అత్యాధునిక విద్యుత్ లోకో క్యాబ్

విశాఖపట్నం, మే 18 (ఆంధ్రజ్యోతి): బనారస్ లోకో మోటివ్ వర్క్సులో జరగనున్న అఖిల భారత లోకో క్యాబ్ పోటీలకు విశాఖ విద్యుత్ లోకోషెడ్ నుంచి సిద్ధమైన వైడ్ గేజ్ ఆల్టర్‌నేటింగ్ కరెంట్ పాసింజర్ (డబ్ల్యుఏపీ)7 లోకో మోటివ్ 37419లో వినూత్న మార్పులు ప్రవేశపెట్టారు. ఎలక్ట్రికల్ ఇంజనీర్ బి.షణ్ముఖరావు మార్గదర్శకత్వంలో నైపుణ్య లోకో పైలట్ సిబ్బందికి అనుకూలమైన ఆధునిక వసతులతోపాటు ఇంజన్‌కు కొత్త ఫీచర్లు ప్రవేశపెట్టారు. రెట్రో క్రూ డెస్క్, క్యాబ్ ఏసీ డెక్టింగ్, వెంటిలేషన్‌తో కూడిన ఆధునిక సీట్లు, మెరుగైన డ్రైవింగ్ సౌకర్యం, మోటారు ఆపరేటెడ్ సైడ్ విండో షట్లర్లు, రియర్ వ్యూ కెమెరా, కాషన్ ఆర్డర్ డిస్‌ప్లే, రేడియం స్టిక్కర్లతో కూడిన స్లిప్ ఫ్లోరింగ్, డ్రైవర్ టూల్ బాక్సు, సర్దుబాటు క్యాబ్ స్పాట్ లైట్లు వంటి కొత్త ఫీచర్లతో ఆలిండియా విద్యుత్ లోకో క్యాబ్ పోటీలకు సిద్ధం చేసిన లోకోను డీఆర్ఎం లలిత్ బొహ్రా ఆదివారం పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోకో మోటివ్‌ను అత్యాధునికంగా మెరుగుపరచడంలో సిబ్బంది చూపిన నైపుణ్యం, అంకితభావాన్ని అభినందించి రూ.ఐదు వేలు నగదు ప్రోత్సాహాన్ని అందించారు. సిబ్బంది నిబద్ధత, చిత్తశుద్ధి, నైపుణ్యానికి నిదర్శనంగా నిలుస్తుందని, విద్యుత్ లోకో క్యాబ్ పోటీలలో విజయం సాధించాలని ఆకాంక్షించారు.


అత్యాధునిక లోకో క్యాబ్‌లో డీఆర్ఎం లలిత్ బొహ్రా

డిప్యూటీ మేయర్ జనసేనదే

... 5వ పేజీ తరువాయి

ఆయనకే ఈ పదవి లభించవచ్చని ఆ పార్టీ నేతలు అంచనా వేస్తున్నారు. కానీ ఉషశ్రీ కోసం జనసేనలోని కొందరు ప్రజాప్రతినిధులు బలంగా పట్టుబడుతుండడంతో ఆమె కూడా పోటీలో నిలిచినట్టయింది. జనసేనకే ఈ పోస్టును కేటాయించినట్టయితే టీడీపీ నుంచి డిప్యూటీ మేయర్ పదవిని ఆశించిన 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత, 18వ వార్డు కార్పొరేటర్ గొలగాని మంగవేణి, 76వ వార్డు కార్పొరేటర్ గంధం శీనివాసరావులకు నిరాశే మిగిలినట్టవుతుంది. యాదవ మహిళకు డిప్యూటీ మేయర్‌గా అవకాశం కల్పించకపోతే ఆ సామాజిక వర్గం నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురుకావచ్చని పలువురు టీడీపీ కార్పొరేటర్లు అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలిసింది. వైసీపీ నుంచి వచ్చిన వాళ్లకు అవకాశం ఇస్తే మాత్రం తామంతా వ్యతిరేకంగా ఓటేసే అవకాశం లేకపోలేదని వారు హెచ్చరించినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో సోమవారం డిప్యూటీ మేయర్ ఎన్నిక ఎలా జరుగుతుందనే దానిపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

ఖాకీల అవినీతిపై సీపీ సీరియస్!

... 5వ పేజీ తరువాయి

చేసినట్టు తెలియవచ్చింది. అదేవిధంగా మల్కాపురం సీఐ విద్యాసాగర్ స్టేషన్‌కు వచ్చిన మహిళను లైంగికంగా వేధించడం, అదే పనిగా ఆమెకు ఫోన్ చేసి ఇబ్బంది పెడుతున్నట్టు ఫిర్యాదు అందడంతో ఆయనను కూడా రేంజ్ వీఆర్‌కు సరెండర్ చేసినట్టు చేసినట్టు సమాచారం. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న పలువురు సీఐలపై ఒకటి రెండు రోజుల్లో శంఖబ్రత బాగ్చి బదిలీ వేటు వేసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఎవరిపై వేటు పడుతుందనే దానిపై పోలీస్ వర్గాల్లో తీవ్రస్థాయిలో చర్చ జరుగుతోంది.

బదిలీల హడావిడి

... 5వ పేజీ తరువాయి

కొందరు మధ్యలో అనకాపల్లి జిల్లాకు వెళ్లి ఏడాదిలో తిరిగి వచ్చి కొనసాగుతున్నారు.

ఉపాధ్యాయుల బదిలీలకు మార్గం సుగమం

జిల్లా విద్యాశాఖలో ఉపాధ్యాయుల బదిలీలకు దాదాపు మార్గం సుగమం అయింది. ఇందుకు సంబంధించి ఒకటి రెండు రోజుల్లో షెడ్యూల్ వెలువడనున్నది. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన జరిగే బదిలీల కోసం విద్యాశాఖ జాబితా రూపొందించింది. ఒకేచోట ఐదేళ్లు/ఎనిమిదేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న ఉపాధ్యాయులు సుమారు 2,300 మంది వరకు ఉంటారని అంచనా వేశారు. ఇంకా మరో రెండువేల మంది వరకు బదిలీలు జరుగుతాయని అంటున్నారు. ఉమ్మడి జిల్లా మొత్తంగా ఐదువేల మంది టీచర్లకు బదిలీలు జరుగుతాయని ఉపాధ్యాయ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. దాదాపు ఎనిమిదేళ్ల తరువాత ఈ పర్యాయం భారీగా బదిలీలు జరుగుతాయని అంచనా వేస్తున్నారు.

కేజీహెచ్‌లో ఆధిపత్య పోరు!

... 5వ పేజీ తరువాయి

మూడు కోట్ల రూపాయలను హెచ్‌డీఎస్ అకౌంట్‌కు బదిలీ చేయాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ అడుగుతున్నారు. కానీ అలా చేయవద్దంటూ మరో అధికారి ఒత్తిడి తెస్తున్నట్టు తెలిసింది. ఈ వ్యవహారం గత కొన్ని రోజులుగా నలుగుతున్నా పరిష్కారం మాత్రం లభించడం లేదని చెబుతున్నారు. జీ-1 సెక్షన్‌లో పనిచేసే ఉద్యోగిని మరో సీటుకు మారుస్తూ ఇప్పటికి రెండుసార్లు ఉత్తర్వులు వెలువడ్డాయి. కానీ ఆ ఉత్తర్వులను అమలు కాకుండా మరో అధికారి అడ్డుచెప్పినట్టు తెలుస్తోంది. దీంతో సదరు ఉద్యోగి అక్కడే కొనసాగుతున్నారు. తాజాగా ఆస్పత్రి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ చాంబర్ వద్ద ప్రత్యేకంగా సీసీ కెమెరాను ఏర్పాటు చేయించారు. ఆయన చాంబర్‌లోకి వెళ్లే ఉద్యోగుల గురించి తెలుసుకునేందుకే దీనిని ఏర్పాటు చేసినట్టు కింది స్థాయి సిబ్బంది పేర్కొంటున్నారు. ఆస్పత్రిలోని వివిధ విభాగాల తనిఖీ సమయంలోనూ ఇద్దరి మధ్య ఆధిపత్య పోరు స్పష్టంగా కనిపిస్తుందని వారంటున్నారు. ఒక ఉన్నతాధికారి చెప్పినట్టు అక్కడి సిబ్బంది చేస్తే.. మరో అధికారి వచ్చి అలా చేయకూడదంటూ ఆదేశిస్తున్నారని చెబుతు న్నారు. శానిటేషన్, సెక్యూరిటీ పనితీరు సరిగ్గా లేదని ఆస్పత్రి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అనేకసార్లు సమావేశాలు పెట్టి సరిదిద్దుకోవాలని హెచ్చరించారు. ఆ తరువాత కేజీహెచ్ సూపరింటెండెంట్ కూడా వారితో పలు దఫాలు సమావేశాలు నిర్వహించి తన ఆదేశాలు పాటించాలని సూచించినట్టు తెలిసింది. ఆస్పత్రిలో తనకు తెలియకుండా ఏదీ జరగకూడదని సూపరింటెండెంట్ చెబుతుంటే.. తనకు సమాచారం లేకుండా పనులు చేస్తే మాత్రం ఇబ్బందులు తప్పవని అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ హెచ్చరిస్తున్నారు. దీంతో కేజీహెచ్‌లో పని చేసే ఉద్యోగులకు ముందు నుయ్యి, వెనుక గొయ్యి అన్న చందంగా తయారైంది. ఏదైనా పని చేస్తే ఎవరేమంటారో అన్న సందిగ్ధంలో ఉద్యోగులు ఉండడంతో అనేక సేవలపై ప్రభావం పడుతున్నట్టు చెబుతున్నారు. కొన్ని కీలక ఫైళ్లు ముందుకు సాగడంలో అవాంతరాలు ఎదురవుతున్నాయని పేర్కొంటున్నారు.

నోటి దురుసుతనంతో ఇబ్బందులు..

ఒకవైపు ఇద్దరు ఉన్నతాధికారుల ఆధిపత్య పోరుతో ఇబ్బందులు పడుతుంటే.. కేజీహెచ్ ఉన్నతాధికారి నోటి దురుసుతనంతో మరికొంతమంది ఉద్యోగులు ఇక్కట్లకు గురవుతున్నారు. కిందిస్థాయి సిబ్బంది పనితీరును మెరుగుపరిచే క్రమంలో ఆయన వినియోగిస్తున్న భాష కొంత ఎబ్బెట్టుగా ఉంటోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నర్సింగ్ సిబ్బందితోపాటు సెక్యూరిటీ, శానిటేషన్, పలువురు వైద్య సిబ్బందికి ఆయన భాష ఇబ్బందికరంగా ఉంటున్నట్టు చెబుతున్నారు. ఉన్నత స్థానంలో ఉన్న అధికారి మాట్లాడే తీరు ఇదేనా.. అంటూ పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. అంతేకాక ఏదైనా పనిమీద ఆయన వద్దకు వస్తే ఎక్కువ సమయం నిరీక్షించేలా చేస్తున్నారని, దీనివల్ల తమ పనులకు జాప్యం కలుగుతోందని పలువురు ఉద్యోగులు పేర్కొంటున్నారు. కేజీహెచ్‌లో నెలకొన్న పరిస్థితులపై ఉన్నతాధికారులు దృష్టిసారించి వాటిని చక్కదిద్దాలని పలువురు కోరుతున్నారు.

మెడికల్ సర్టిఫికెట్ల మాయాజాలం!

... 5వ పేజీ తరువాయి

టీచర్లు మరోసారి వైద్యుల ముందు హాజరు కావాలని పేర్కొనడంతో గతనెల 24, 25, 26 తేదీల్లో కేజీహెచ్, ఈఎన్‌టీ, కంటి ఆస్పత్రుల్లో నిర్వహించిన పరీక్షలకు వారు హాజరయ్యారు. ఉమ్మడి జిల్లాలో 600 మంది టీచర్లు 56 శాతం అంతకంటే ఎక్కువ వైకల్యం ఉన్నట్టు గతంలో మెడికల్ బోర్డుల నుంచి సర్టిఫికెట్లు తీసుకుని బదిలీల సమయంలో పాయింట్లు పొందారు. వీరిలో ఎక్కువమంది ఇప్పుడు బదిలీలు కోరుకుంటున్నారు. అందువల్ల 442 మందే వైద్య పరీక్షలకు హాజరయ్యారు. టీచర్లకు సంబంధిత వైద్యులు పరీక్షలు నిర్వహించే సమయంలో పలు రకాల రిపోర్టులను ప్రామాణికంగా తీసుకున్నారు. ఎక్కువగా ప్రైవేటు ఆస్పత్రుల నుంచి తెచ్చిన రిపోర్టులను వైద్యులు క్షుణ్ణంగా పరిశీలించాకే ప్రతి ఉపాధ్యాయుడికి సంబంధించి వైకల్యంపై మెడికల్ బోర్డుకు రిఫర్ చేశారు. వైద్యుల ఎదుట హాజరైన ఉపాధ్యాయులందరూ ప్రాధాన్యత పాయింట్ల కోసమేనని చెప్పనక్కర్లేదు. అయితే వైద్యుల తనిఖీల అనంతరం ఆయా టీచర్ ఇబ్బందులపై రిపోర్టు రాసి మెడికల్ బోర్డుకు నివేదించారు. ఈ నివేదికల మేరకు పలువురు ఉపాధ్యాయులు 'ప్రాధాన్యత కేటగిరీ కిందకు వస్తారని, మరికొందరు రారని బోర్డు స్పష్టం చేసింది'. కేజీహెచ్ జారీ చేసిన సర్టిఫికెట్‌లో కొన్నింటిపై చేతి రాతతో రాయడం గమనార్హం. గతంలో ఇచ్చిన రిపోర్టుల్లో ఏమైనా తేడాలున్నాయా? లేదా అప్పటి టీచర్ల ఆరోగ్య పరిస్థితి మేరకు వైద్యులు సర్టిఫికెట్లు జారీ చేశారా.? అన్నది ఎవరూ చెప్పలేని పరిస్థితి. అయితే కొందరి సర్టిఫికెట్ల జారీలో మాత్రం అవకతవకలు జరిగాయని గతంలో పలువురిపై ఫిర్యాదులు వచ్చాయి. గతనెలలో పరీక్షలు నిర్వహించిన వైద్యుల రిపోర్టుల మేరకు రెండు మూడు రోజుల క్రితం కేజీహెచ్, ఈఎన్‌టీ, కంటి ఆస్పత్రి సూపరింటెండెంట్లు విశాఖ జిల్లా విద్యాశాఖాధికారికి సర్టిఫికెట్లను పంపారు. మొత్తం 442 మంది వైద్య పరీక్షలకు హాజరైతే వారిలో సగం మందే ప్రాధాన్యత కేటగిరీలోకి వస్తారని మెడికల్ బోర్డులు ధ్రువీకరించాయి. దీంతో ఈ పర్యాయం బదిలీల్లో ప్రాధాన్యత కేటగిరీలో పాయింట్లు పొంది బదిలీల్లో మంచి స్థానాలు పొందే అవకాశాన్ని కొందరు కోల్పోయారు. ఈసారి బదిలీల్లో ఒక పాఠశాలలో 50 శాతానికి మించి ప్రాధాన్యత కేటగిరీలో టీచర్లు రాకుండా ప్రభుత్వం ఆంక్షలు విధించింది. దీంతో నగరం, పరిసరాల్లోని పాఠశాలలకు ఇతర కేటగిరీ టీచర్లు రానున్నారని విద్యాశాఖ వర్గాలు తెలిపాయి.

లయన్స్ క్యాన్సర్ ఆసుపత్రికి రూ.లక్ష విరాళం


నిర్వాహకులకు చెక్కు అందజేస్తున్న దాత

సీతమ్మధార, మే 18 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధారలోని లయన్స్ క్యాన్సర్, జనరల్ ఆసుపత్రి వ్యవస్థాపక ట్రస్టీ, వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు ఏఎస్ఎన్ ప్రసాద్ 93వ జన్మదినం సందర్భంగా లయన్స్ క్యాన్సర్, జనరల్ ఆసుపత్రికి రూ.లక్ష విరాళం ఇచ్చారు. లయన్స్ ఆసుపత్రి మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ వి.ఉమామహేశ్వరరావు చెక్కును అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య వెలగపూడి ఉమామహేశ్వరరావు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు టీడీపీ విశాఖ ఉత్తర మహానాడు

విశాఖపట్నం, మే 18 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉత్తర నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ మహానాడు సోమవారం ఉదయం 10 గంటలకు జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరగనున్నది. మహానాడుకు విశాఖ పార్లమెంటు అధ్యక్షుడు గండి బాబ్జి అధ్యక్షత వహిస్తారు. మహానాడుకు నియోజకవర్గంలో అన్ని వార్డుల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడి మృతి

ఆరిలోవ, మే 18 (ఆంధ్రజ్యోతి): ఎండాడ సమీపంలో ఆదివారం వేకువన గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ద్విచక్ర వాహనదారుడు మృతి చెందినట్టు ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావు తెలిపారు. నగరంలో అక్కయ్యపాలెం సమీపంలోని శ్రీనివాస్ నగర్‌కు చెందిన కిశోర్‌కుమార్ (32) హనుమంతవాక జంక్షన్ నుంచి పీఎంపాలెంకు స్కూటీపై వెళుతూ, ఎండాడ పెట్రోలు బంక్ సమీపంలో ఒక లారీని అధిగమించాడు. ఆ సమయంలో అక్కడ యూటర్న్ తీసుకోవడానికి యత్నించగా, స్కూటీ డివైడర్‌కు తగలడంతో అదుపుతప్పి రోడ్డుపై పడిపోయాడు. అదే సమయంలో మధురవాడ వైపు నుంచి వస్తున్న లారీ ఆయన తలపై నుంచి దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి అన్న తిప్పాన చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కమ్యూనిటీ హాలులో నీటి కోసం వినతి

మాధవధార, మే 18 (ఆంధ్రజ్యోతి): మాధవధార వంశీనగర్‌లోని ఉమ్మడి విశాఖ జిల్లా రజక సంఘం కార్యాలయంలో తాగునీటి సదుపాయం లేక ఇబ్బందులు పడుతున్నామని రజక సంఘం జిల్లా అధ్యక్షుడు తోకాడ రాము వార్డు టీడీపీ అధ్యక్షుడు ఎస్.వరప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. ఆదివారం ఆయనకు వినతి పత్రం అందజేసి తమ సంక్షేమ భవనానికి మంచినీటి వసతి కల్పించాలని కోరారు. సంఘం జిల్లా చైర్మన్ పి.మోహనరావు, సిటీ కన్వీనర్ పి.గురునాధరావు తదితరులు ఆయనను కలిశారు. కొత్త భవనం నిర్మించి నాలుగేళ్లు కావస్తున్నా నీటి సదుపాయం లేక నిరుపయోగంగా మారిందన్నారు.

టీడీపీ నూతన కమిటీ నియామకం


నూతన సభ్యులు వీరే

మహారాణిపేట, మే 18 (ఆంధ్రజ్యోతి): దక్షిణ నియోజకవర్గంలో టీడీపీ 38వ వార్డు నూతన కమిటీని నియమించారు. ఆదివారం విశ్వబ్రాహ్మణ కమ్యూనిటీ హాల్‌లో జరిగిన సర్వసభ్య సమావేశంలో పార్టీ దక్షిణ నియోజకవర్గం ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్ సూచనల మేరకు నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గోడి నరసింహాచారి, ప్రధాన కార్యదర్శిగా భూమిరెడ్డి కృష్ణారెడ్డి, కోశాధికారిగా నాజాన శ్రీరాములు నియమితులయ్యారు. సభ్యులను, మహిళా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వైభవంగా దుర్గమాంబ అమ్మవారి మహోత్సవం

అక్కయ్యపాలెం, మే 18 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 46వ వార్డు కైలాసపురం శాంతినగర్‌లో వేంచేసిన 16 గ్రామాల ఇలవేల్పు దుర్గమాంబ అమ్మవారి జాతర మహోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. అమ్మవారిని ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, టీడీపీ నాయకుడు వెల్లంకి భరత్ దర్శించుకొని పూజలు చేశారు. ఎమ్మెల్యేకు ఆలయ కమిటీ ప్రతినిధులు, నేషనల్ పోర్టు ట్రస్ట్ యూనియన్ అధ్యక్షుడు గొర్లె చందు ఘనస్వాగతం పలికారు. ఉదయం నుంచి అమ్మవారికి ఘటాలతో, నేల డ్యాన్సులు, మందుగుండు సామగ్రితో భారీ ఊరేగింపు జరిగింది. రాత్రి వివిధ స్టేజ్ కార్యక్రమాలు, రేలా రేలా జానపద గీతాలు, ఆర్కెస్ట్రా తదితర సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో సురేష్‌బాబు, ఎల్.కృష్ణ, రవి, ఎం.శ్రీను, కాశీ, రొంగల శ్రీను, వెంకటరమణ, వినయ్, తరుణ్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.


అమ్మవారిని దర్శించుకుంటున్న ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు తదితరులు

ఘనంగా ఎర్నిమాంబ అమ్మవారి ఉత్సవం


అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ తదితరులు

జ్ఞానాపురం, మే 18 (ఆంధ్రజ్యోతి): జ్ఞానాపురం, అల్లిపురం ప్రజలు తమ ఇలవేల్పుగా కొలిచే ఎర్నిమాంబ అమ్మవారి జాతర మహోత్సవాలు ఆలయ ఈవో డీవీవీ సురేష్ బాబా ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు అమ్మవారి దర్శనానికి బారులు తీరారు. అర్చకుడు పులఖండం శ్రీకాంత్‌శర్మ, పూజారమ్మ వాసుపల్లి విజయమ్మలు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, ఎన్టీఆర్ వైద్య సేవ చైర్మన్ సీతంరాజు సుధాకర్, 41వ వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ శ్రీధర్, ఐతి మధుబాబు, ఆంతోని శేఖర్ ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం మూలవిరాట్‌ను వేలాది మంది సుమారు 252 అమ్మవారి ప్రతిమలతో దర్శించుకున్నారు. అనంతరం అనుపోత్సవం ఘనంగా నిర్వహించారు. జాతరలో నేలవేషాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. పలు సంఘాల ప్రతినిధులు భక్తులకు మజ్జిగ, పులిహోర పంపిణీ చేశారు.

రేపు కుంచుమాంబ ప్రధాన పండగ

కంచరపాలెం, మే 18 (ఆంధ్రజ్యోతి): రెడ్డి కంచరపాలెం గ్రామ ఆరాధ్య దేవత కుంచుమాంబ అమ్మవారి ప్రధాన పండగను మంగళవారం నిర్వహించడానికి గ్రామస్తులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఊర్వశి జంక్షన్ తుమ్మడిపాలెం వద్ద అమ్మవారి ఆలయాన్ని పూజలకు సిద్ధం చేశారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం తొలేళ్లు నిర్వహిస్తారు. భక్తులు, గ్రామస్తులు ఆర్పీపేట పైడిమాంబ అమ్మవారి ఆలయం వద్ద నుంచి ప్రతిమలతో గ్రామంలో గల సదరం పుట్టబంగారం గుడి వద్దకు తీసుకుని వస్తారు. అనంతరం ఘటాలతో గ్రామంలో ఊరేగింపు జరుపుతారు. భక్తులు అమ్మవారి ప్రతిమలతో రెడ్డికంచరపాలెం నుంచి తుమ్మడిపాలెం అమ్మవారి గుడి వద్దకు ర్యాలీగా వెళ్లనున్నట్టు గ్రామాభ్యుదయ సంఘం తెలిపింది. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా శ్రీరామ సేవాసంఘం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.

జూన్ 6 నుంచి బంగారమ్మతల్లి పండుగ

మహారాణిపేట, మే 18 (ఆంధ్రజ్యోతి): జూన్ 6 నుంచి బంగారమ్మ తల్లి మహోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు ప్రకాశరావుపేట ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మూడేళ్లకు ఓసారి ఈ గ్రామ దేవత పండుగ నిర్వహిస్తామన్నారు. ఆదివారం స్థానిక జనసేన నాయకుడు మన్యాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సభ్యులు పండుగ కరపత్రాన్ని ఆవిష్కరించారు. జూన్ 6 నుంచి 10 వరకు విశేష పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలతో పండుగ జరుగుతుందని శ్రీనివాస్ తెలిపారు.

'కళింగాంధ్రుల చరిత్రను తిరిగి రాయాలి'

సీతంపేట, మే 18 (ఆంధ్రజ్యోతి): కళింగాంధ్రుల అస్తిత్వాన్ని చాటుకోవడానికి చరిత్రను తిరిగి రాయాల్సిన అవసరం ఉందని ఆచార్య కె.ఎస్.చలం అన్నారు. విశాఖపట్నంలోని ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఆచార్య చందు సుబ్బారావు లిటరరీ అండ్ కల్చరల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సీనియర్ జర్నలిస్టు, రచయిత, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాకు చెందిన నల్లి ధర్మారావుకు సాహిత్య సేవా పురస్కారాన్ని ఆదివారం ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన చందు సుబ్బారావు ట్రస్ట్ చైర్మన్, యూపీఎస్సీ మాజీ సభ్యుడు ఆచార్య కె.ఎస్.చలం సాహితీ విలువల గురించి, దిగజారిపోతున్న తెలుగు భాష ఔన్నత్యాన్ని కాపాడుకోవలసిన అవసరాన్ని గుర్తుచేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం మాజీ వీసీ ఆచార్య ముర్రు ముత్యాల నాయుడు, నల్లి ధర్మారావుకు పురస్కారాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పుట్టిన తేదీతోపాటు పుట్టడానికి గల కారణాన్ని తెలుసుకుని, అందుకు అనుగుణంగా నడుచుకోవాలన్నారు. పురస్కార ప్రదాత ఆచార్య చందు సుబ్బారావు ప్రసంగిస్తూ సాహిత్యం, విజ్ఞానం (సైన్స్) మధ్య ఉన్న సంబంధాన్ని విశ్లేషించారు. పురస్కార గ్రహీత నల్లి ధర్మారావు మాట్లాడుతూ చందు సుబ్బారావు హృదయాన్ని గెలవడం తన అదృష్టమన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ డి.వి.సూర్యారావు, చందు సుబ్బారావు రచనలు, సాహిత్య విమర్శలను వివరించారు. ఎస్.హనుమంతరావు, పి.ఎ.రాజు, బసుపోతన హరి వెంకటరమణ, గరిమ నరసింహ పాల్గొన్నారు.


నల్లి ధర్మారావును సత్కరిస్తున్న నిర్వాహకులు

ఆరేళ్ల పాప కోసం హైరానా

మురళీనగర్, మే 18 (ఆంధ్రజ్యోతి): మాధవధార ఉడాకాలనీలో ఓ ఆరేళ్ల పాల చిన్మయి తప్పిపోయిందని, ఉదయం 11 గంటల సమయంలో సమాచారం అందుకున్న పోలీసులు ఆ బాలిక ఆచూకీ కోసం గాలించారు. సబ్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, ఏఎస్ఐ, కానిస్టేబుల్, బ్లూకోల్ట్ స్టాఫ్ కాలనీ రోడ్లన్నీ తిరిగారు. తల్లి కిరణ్మయి తీవ్రంగా విలపించడంతో అందరూ ఆందోళన చెందారు. ఉడాకాలనీ లక్ష్మీగణపతి ఆలయం సమీపంలోని కొండ పక్కగా ఉన్న ఎల్ఐజి ఫేజ్-2 వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు ఆ బాలిక ఆచూకీ తెలుసుకునేందుకు చాలా మందిని ఆరా తీశారు. ఎట్టకేలకు తాము నివాసం ఉంటున్న ఇంటి పక్కనే ఇరుగు పొరుగు ఇంట్లో మేడపై బాలిక ఆడుకుంటున్నట్లు తల్లి గుర్తించింది. పోలీసులను హైరానాకు గురిచేసిన ఈ సంఘటన సుఖాంతం కావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.


ఉడాకాలనీలో గాలిస్తున్న పోలీసులు

హెచ్ఐవీ మృతులకు నివాళి


కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

సీతమ్మధార, మే 18 (ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీ, ఎయిడ్స్‌తో మృతిచెందిన వారిని గుర్తుంచుకుంటాం.. బాధితులతో మాట్లాడుతాం.. వారిని నడిపిస్తామంటూ నినాదాలతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జగదీశ్వరరావు, జిల్లా ఎయిడ్స్, లెప్రసీ, టీబీ నివారణ అధికారి డాక్టర్ పూర్ణేంద్ర బాబులు ర్యాలీలో పాల్గొన్నారు. జిల్లా వైద్యాధికారి కార్యాలయం నుంచి సత్యం కూడలి మీదుగా రామాటాకీస్ వరకు కొవ్వొత్తులతో ర్యాలీలో పాల్గొన్నారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా అధికారి కొన్ని మార్గదర్శకాలను విడుదల చేశారు. స్వచ్ఛంద సంస్థలు, అధికారులు, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ విభాగం అధికారి ఉమామహేశ్వరరావు, సూపర్‌వైజర్ బద్రి పాల్గొన్నారు.

పహల్గాం హత్యలు, ఆపరేషన్ సిందూర్‌పై విచారణకు డిమాండ్

అల్లిపురం, మే 18 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పహల్గాం హత్యలు, ఆపరేషన్ సిందూర్‌పై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలు ప్రజలకు చెప్పాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి ప్రసాద్ డిమాండ్ చేశారు. అల్లిపురంలోని నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో ఆదివారం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ యుద్ధం వద్దు, శాంతి కావాలని, ఆపరేషన్ సిందూర్ పేరుతో పాకిస్థాన్‌పై జరుగుతున్న యుద్ధాన్ని అర్ధంతరంగా నిలిపివేయడానికి రహస్య కారణాలేంటో ప్రజలకు చెప్పాలన్నారు. రెండు దేశాల మధ్య యుద్ధ దాడులు జరుగుతున్న నేపథ్యంలో, వాటిని నిలిపివేయాలనుకున్నప్పుడు కనీసం మంత్రివర్గ సమావేశంలో చర్చించలేదన్నారు. పార్లమెంటును సమావేశపరచలేదని ఆక్షేపించారు. ప్రధానులుగా వ్యవహరించిన జవహర్‌లాల్ నెహ్రూ నుంచి మన్మోహన్‌సింగ్ వరకు ఇలా జరగలేదన్నారు. దాడులకు ముందు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసినప్పటికీ అందులో ప్రధాని నరేంద్ర మోదీ ఎందుకు పాల్గొనలేదని ప్రశ్నించారు. ట్రంప్ ఆదేశాలతో ఇలాంటి నిర్ణయానికి వచ్చారంటే అమెరికాకు భారతదేశం లొంగిపోయినట్లుగా ఉందన్నారు. పహల్గాం దాడులు ఎందుకు జరిగాయి? ఎవరు చేశారు? ఆ నలుగురు ఉగ్రవాదులను ఎందుకు పట్టుకోలేకపోయారు? అనే దానిపై ఇప్పటికీ దేశ ప్రజలకు మోదీ ప్రభుత్వం సమాచారం ఇవ్వలేదని విమర్శించారు. పాకిస్థాన్ సరిహద్దు నుంచి 180 కిలోమీటర్ల దూరంలో గల పహల్గాం యాత్రికులపై దాడి జరిగిందని, క్షణాల్లో వ్యక్తులు అక్కడ నుంచి మాయమవ్వడం సాధ్యంకాదని, పర్యాటకులు ఎక్కువగా సందర్శించే ప్రాంతంలో నిఘా వ్యవస్థ ఎందుకు ఏర్పాటు చేయలేదో చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో వై.కొండయ్య, ఎం.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాద్

వర్షంతో చల్లబడిన నగరం

విశాఖపట్నం, మే 18 (ఆంధ్రజ్యోతి): భానుడి భగభగలతో అల్లాడుతున్న నగర వాసులకు సాంత్వన చేకూర్చేలా నగర పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆదివారం రాత్రి వర్షం కురిసింది. రాత్రి 8.30 గంటల సమయంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయిమేఘావృతమైంది. అనేక ప్రాంతాల్లో చిరుజల్లులతో కూడిన వర్షం ప్రారంభమైంది. సుమారు 15 నిమిషాల నుంచి అరగంటపాటు చిరు జల్లులతో కూడిన వర్షం కురవడంతో వాతావరణం కాస్త చల్లబడింది.కొన్ని వారాలుగా ఎండ తీవ్రత, ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలకు తాజాగా కురిసిన వర్షంతో ఉపశమనం లభించినట్టయింది. కొన్నిచోట్ల గాలులతో కూడిన వర్షం కురవగా, అనేక ప్రాంతాల్లో చిరు జల్లులు మాత్రమే కురిశాయి. కాగా ఆదివారం ఉదయం నుంచే వాతావరణం చల్లదనంగా ఉంది. అనేక ప్రాంతాల్లో మేఘావృతమై ఉండడంతో ప్రజలకు ఎండ బాధలు కాస్తతప్పాయి. ఎండ లేకున్నా ఉక్కపోత వేధించడంతో నగరవాసులు కాస్త ఇబ్బందులకు గురయ్యారు.

రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడి మృతి

ఆరిలోవ, మే 18 (ఆంధ్రజ్యోతి) : ఎండాడ సమీపంలో ఆదివారం వేకువ జామున గుర్తు తెలియనివాహనం ఢీకొనడంతో ద్విచక్ర వాహనదారుడు మృతి చెందినట్టు ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. నగరంలో అక్కయ్యపాలెం సమీపంలోని శ్రీనివాస్ నగర్‌కు చెందిన కిశోర్‌కుమార్ (32) ఆదివారం వేకువజామున హనుమంతవాక జంక్షన్ నుంచి పీఎం పాలెం స్కూటీపై వెళుతూ,ఎండాడ పెట్రోలు బంక్ సమీపంలో ఒక లారీని ఓవర్‌టేక్ చేశాడు. ఆ సమయంలో అక్కడ యూటర్న్ తీసుకోవడానికి యత్నించగా, స్కూటీ డివైడర్‌కు తగలడంతో అదుపుతప్పి రోడ్డుపై పడిపోయాడు. అదే సమయంలో మధురవాడ వైపు నుంచి వస్తున్న లారీ ఆయన తలపై నుంచి దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి అన్న తిప్పాన చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

12వ వార్డులో వెలగని వీధి దీపాలు

ఆరిలోవ, మే 18 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 12వ వార్డులో వీధిలైట్లు వెలగక పలు వీధులు గాఢాంధకారం నెలకొంది. దీంతో రాత్రి వేళల్లో పిల్లలు, మహిళలు, వృద్ధులు రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడుతున్నారు. చాలా రోజుల నుంచి ఈ ప్రాంతంలో వీధి లైట్లు వెలగడం లేదని, ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇది కొండవాలు ప్రాంతం కావడంతో చాలా ఇబ్బందిగా ఉంటోందని, విష పురుగులు సర్పాలు వంటి సంచరించే ప్రాంతాలు కావడం వల్ల చీకట్లో ఎవరికీ ఏ ప్రమాదం జరుగుతుందోననే భయంతో ఉంటున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ఈ వార్డులోని అన్ని ప్రాంతాల్లో వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సినిమా గైడ్

- **మిషన్ ఇంపాజిబుల్** : జగదాంబ
- **ఫైనల్ డెస్టినేషన్** : శారద
- **సింగిల్** : మెలోడి, శరత్, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సప్తగిరి (తగరపువలస)
- **శుభం**: శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)
- **హిట్-3** :సంగం, శ్రీరామ, శ్రీలీలామహల్, గోకుల్, ఊర్వశి (కంచర పాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 14, వంకాయలు (తెలుపు) 38, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 20, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 36, బీరకాయలు 36, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 32, క్యాబేజీ 15, క్యారెట్ 38 దొండకాయలు 24, బంగాళదుంపలు 19, అరటికాయ (పె)9, మునక్కాడలు (కిలో) 60, అల్లం (పాతది)50, బరబాటి 22, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 100, బద్దచిక్కుడు 44, దోసకాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 98, కీరదోస 32, కాప్సికమ్ 48, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడదుంపలు 36, కంద 74, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్‌కోల్ 34, పనస పొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	545
విజయనగరం	549
శ్రీకాకుళం	549

చికెన్ ధరలు బ్యాగ్

రైతు ధర	110
లైవ్ ధర	130
విత్ స్కిన్	230
స్కిన్‌లెస్	240

సత్తా చూపిన త్రివిధ దళాలు

» కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ » ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన నేపథ్యంలో తీరంలో ఘనంగా తిరంగా ర్యాలీ


తిరంగా ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యేలు వెలగపూడి, విష్ణుకుమార్‌రాజు, గణబాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరశురామ్‌రాజు, పలువురు నేతలు

విశాఖపట్నం/ బీచ్ రోడ్డు, మే 18 (ఆంధ్రజ్యోతి) :పహల్గాం ఉగ్రదాడి తరువాత పాకిస్థాన్‌లోని ఉగ్రవాదుల శిబిరాలను ధ్వంసం చేసేందుకు చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతం చేసి భారత త్రివిధ దళాలు తమ సత్తాను చాటాయని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన నేపథ్యంలో ఆదివారం సాయంత్రం బీచ్‌రోడ్డులో తిరంగా ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీలో నగర పరిధిలోని అనేక ప్రాంతాలకు చెందిన ప్రజలు, విద్యార్థులు, మాజీ సైనిక ఉద్యోగులు, వివిధ మతాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. ప్రతిఒక్కరూ జాతీయ జెండాను చేతపట్టుకుని భారత్ మాతాకీ జై.. అంటూ నినాదాలు చేశారు. భారత సైనికుల త్యాగాలను ఈ సందర్భంగా అందరూ గుర్తు చేసుకున్నారు. అమరులైన సైనికులను స్మరించుకుంటూ వీర జవాన్లు అమర్ రహే అంటూ నినదించారు. భారీ త్రివర్ణ పతాకాన్ని తిరంగా ర్యాలీ వెంబడి ప్రదర్శించారు.

ర్యాలీలో పాల్గొన్న కేంద్ర మంత్రి మాట్లాడుతూ పహల్గాంలో పర్యాటకులపై విచక్షణారహితంగా ఉగ్రవాదులు కాల్పులు జరిపి భార్యల కళ్లెదుటే వారి భర్తలను హతమార్చడం దారుణమన్నారు. అటువంటి దుర్మార్గులకు ఆపరేషన్ సిందూర్ పేరుతో ప్రధాని నరేంద్ర మోదీ గట్టిగా బుద్ధి చెప్పారన్నారు. పాకిస్థాన్‌లోని ఉగ్రమూకల స్థావరాలపై దాడులు నిర్వహించి వారిని మట్టుబెట్టారన్నారు. భారత్ చేపట్టిన దాడి, సైనిక సామర్థ్యాలను చూసి అనేక దేశాలు ఆశ్చర్యపో యాయన్నారు. ఆపరేషన్ సిందూర్‌తో భారత త్రివిధ దళాల శక్తి సామర్థ్యాలు ఏమిటో ప్రపంచానికి తెలియడంతో పాటు అనేక దేశాలు ప్రశంసలు కురిపిస్తున్నాయని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో అశువులు బాసిన వీర సైనికులకు దేశమంతా నివాళులు అర్పిస్తోందని, ఈ ర్యాలీలో పాల్గొన్న జనమే వారిలో దాగివున్న దేశభక్తికి నిదర్శనమన్నారు.

కార్యక్రమంలో ఎమ్మె ల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, పి.విష్ణుకుమార్‌రాజు, పి.గణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, పంచకర్ల రమేశ్‌బాబు, మేయర్ పీలా శ్రీనివాసరావు, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, మాజీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరశురామ్, పీవీఎన్ మాధవ్, నాగేంద్ర, పసుపులేటి ఉషాకిరణ్, పలువురు కార్పొరేటర్లు, అధిక సంఖ్యలో ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

తెలుగు పరిరక్షణ కోసం చర్యలు చేపట్టాలి

» తెలుగుతల్లి విగ్రహం వద్ద తెలుగుదండు ఆధ్వర్యంలో ఆందోళన


తెలుగుతల్లి విగ్రహం వద్ద ఆందోళన నిర్వహిస్తున్న తెలుగుదండు ప్రతినిధులు

మద్దిలపాలెం, మే 18 (ఆంధ్రజ్యోతి) : తెలుగుభాష రక్షణలో కూటమి ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటోందని నిరసిస్తూ మద్దిలపాలెం కూడలిలోని తెలుగు తల్లి విగ్రహం వద్ద ఆదివారం తెలుగుదండు ఆధ్వర్యంలో అర్ధనగ్నప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా తెలుగు దండు అధ్యక్షుడు పరవస్తు సూరి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం భాషావేత్తలు, సాహితీవేత్తలతో చర్చించి తెలుగు భాషా రక్షణ కోసం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం విద్యావ్యవస్థలో ఆరు అంచెల విద్యా విధానాన్ని ప్రవేశపెట్టి తెలుగు భాషను నాశనం చేస్తే, నేటి కూటమి ప్రభుత్వం కూడా అదే దారిలో వెళ్తూ ఏకంగా తొమ్మిది అంచెల విద్యావిధానాన్ని ప్రవేశపెడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ తెలుగుద్వేషంగా నిర్ణయాలు తీసుకుంటుందని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా పునరాలోచన చేసి తెలుగు రక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆచార్య ప్రసాద్, డాక్టర్ కేవీఎస్ మూర్తి, చిన్నసూర్యనారాయణ, సూరప్పడు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక భవనం ప్రారంభం


సామాజిక భవనాన్ని ప్రారంభిస్తున్న నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, పాల్గొన్న తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి, వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్

పెదవాల్తేరు, మే 18 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 17వ వార్డు పెదవాల్తేరులోని దళాయి వీధిలో జీవీఎంసీ నిధులు సుమారు రూ.65 లక్షలతో నిర్మించిన నూతన సామాజిక భవనాన్ని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, తూర్పు నియోజకవర్గం శాసన సభ్యుడు వెలగపూడి రామకృష్ణబాబు, వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ ఆదివారం ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి ఒక్కరూ ఈ సామాజిక భవనాన్ని ఉపయోగించుకువచ్చని కోరారు. కార్యక్రమంలో జీవీఎంసీ జోన్-3 కమిషనర్ శివప్రసాద్, ఈఈ గంగాధర్, డీఈ పద్మావతి, ఏఈ అప్పలనాయుడు, వార్డు కార్పొరేటర్ గేదల లావణ్య, టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి పట్టాభిరామ్, టీడీపీ నాయకులు బైరెడ్డి పోతన్న రెడ్డి, నాగరాజు, కాళ్ల శంకర్, సీహెచ్ జ్యోతి, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఒకేతాటిపైకి రాష్ట్ర కబడ్డీ సంఘాలు

» క్రీడాకారుల భవిష్యత్తు కోసం కలిసి సాగుతాం : వెంకటరెడ్డి

» నేర కార్యకలాపాలకు పాల్పడిన శ్రీకాంత్‌పై శాప్‌కు ఫిర్యాదు చేస్తాం: వంశీకృష్ణ శ్రీనివాస్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న విశాఖ దక్షిణ ఎమ్మెల్యే, కబడ్డీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్, చిత్రంలో మరో సంఘం అధ్యక్షుడు వెంకటరెడ్డి తదితరులు

విశాఖపట్నం స్పోర్ట్సు, మే 18 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సమాంతర సంఘాల పోరు లేకుండా ఆంధ్రప్రదేశ్‌లో ఒకే కబడ్డీ సంఘం ఉండాలన్న ఉద్దేశంతో అందరం కలిసి ముందుకు వెళ్లేందుకు సుముఖంగా ఉన్నట్టు రాష్ట్ర కబడ్డీ సంఘం (రెండో సంఘం) అధ్యక్షుడు జి.వెంకటరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం విశాఖపట్నం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గతంలో కేతఈ ప్రభాకర్, వీర లంకయ్య అధ్యక్ష, కార్యదర్శులుగా వ్యవహరిస్తున్న రాష్ట్ర కబడ్డీ సంఘానికి సమాంతరంగా మరో సంఘం ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పకుండా శ్రీకాంత్ అనే వ్యక్తి తనను తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ రకాల జిల్లా కబడ్డీ సంఘాల పేరుతో సమాంతర రాష్ట్ర కబడ్డీ సంఘం ఏర్పాటు చేసిన సంగతి తెలియలేదని, దీంతో ఆ సంఘానికి తాను అధ్యక్షునిగా, శ్రీకాంత్ కార్యదర్శిగా వ్యవహరించామన్నారు. ఈ నేపథ్యంలో శ్రీకాంత్ అనేక అనైతిక, ఆర్థిక, నేర కార్యకలాపాలకు పాల్పడిన విషయాన్ని గుర్తించి నిలదీశానన్నారు. గతంలో కృష్ణా జిల్లా కబడ్డీ సంఘం కార్యదర్శిగా కూడా శ్రీకాంత్ అనేక అవకతవలకు పాల్పడినట్టు తన దృష్టికి రావడంతో క్రీడాకారుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పరిష్కారానికి కృషి చేశానన్నారు. దీనిలో భాగంగా ఇటీవల రాష్ట్ర కబడ్డీ సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించి శ్రీకాంత్ అక్రమాలు, నేర వ్యవహారాలపై ప్రశ్నించామన్నారు. దీనిపై అతడు ఎటువంటి సమాధానం ఇవ్వకుండా, కొద్ది రోజుల తర్వాత కొందరితో అనధికారికంగా సమావేశం నిర్వహించి రాష్ట్ర సంఘాన్ని కబ్జా చేసే ప్రయత్నం చేశాడని ఆరోపించారు. ఈ విషయాన్ని ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ రవినాయుడు దృష్టికి తీసుకువెళ్లానని వెంకటరెడ్డి తెలిపారు. ఇటువంటి వ్యక్తుల వ్యవహార శైలి క్రీడాకారుల భవిష్యత్తుకు ఆటంకంగా మారుతున్నట్టు గుర్తించి, విశాఖ దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అధ్యక్షునిగా ఉన్న రాష్ట్ర సంఘానికి తన మద్దతు తెలిపానని స్పష్టం చేశారు.

శ్రీకాంత్ నేర కార్యకలాపాలపై విచారణ

\- ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

వైసీపీ ప్రభుత్వ పెద్దల అండతో సమాంతర రాష్ట్ర సంఘం ఏర్పాటు చేయడమే కాకుండా క్రీడాకారుల భవిష్యత్తుతో ఆటలాడుకున్న శ్రీకాంత్ నేర కార్యకలాపాలపై విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని కోరనున్నట్టు విశాఖ దక్షిణఎమ్మెల్యే, రాష్ట్ర కబడ్డీ సంఘం అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్ తెలిపారు. శ్రీకాంత్ అక్రమాలపై ఇటీవల శాసనసభలో కూడా మాట్లాడానని, కచ్చితంగా అతనిపై చర్యలు తీసుకునేలా ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థపై ఒత్తిడి తెస్తామన్నారు. వెంకటరెడ్డి నిర్ణయంతో రాష్ట్రంలో కబడ్డీకి ఒకే సంఘం వుండడం శుభ పరిణామమని అన్నారు.

ఈ సమావేశంలో కబడ్డీ సంఘాల ప్రతినిధులు వీర లంకయ్య, ఉరుకూటి శ్రీనివాసరావు, ప్రసాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి ప్రేమవాహిని రథయాత్ర ప్రారంభం


ప్రేమవాహిని రథయాత్ర ప్రారంభోత్సవంలో పాల్గొన్న పీఆర్ఎస్ ఎన్ నాయుడు, డీవీవీఎస్ రాజు తదితరులు

పెదవాల్తేరు, మే 18 (ఆంధ్రజ్యోతి) : సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాల్లోభాగంగా శ్రీసత్యసాయి ప్రేమ ప్రవాహిని పేరిట దేశవ్యాప్తంగా పవిత్ర రథయాత్ర నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఆదివారం సాయంత్రం పెదవాల్తేరులోని కరక చెట్టు పోలమాంబ అమ్మవారి ఆలయం వద్ద సత్యసాయి ప్రేమ ప్రవాహిని రథయాత్రను శ్రీసత్యసాయి సేవా సంస్థల విశాఖ జిల్లా అధ్యక్షుడు పీఆర్ఎస్ఎన్ నాయుడు, నగర సమితి కన్వీనర్ డీవీవీఎస్ రాజు తదితరులు ప్రారంభించారు. కరకచెట్టు పోలమాంబ అమ్మవారి ఆలయం నుంచి బయలుదేరిన రథయాత్ర విశాఖ ఐ ఆస్పత్రి, పెదవాల్తేరు జంక్షన్, శాంతి ఆశ్రమం, లాసన్స్ బే కాలనీ, ఉషోదయ జంక్షన్ మీదుగా ఎంవీపి కాలనీలోని సత్యసాయి ప్రేమసదన్ మందిరం వరకు నిర్వహించారు. ఈ రథయాత్రలో సత్యసాయి భజన మండళ్ల కన్వీనర్లు, పదాధికారులు, అన్ని విభాగాల ప్రతినిధులు, బాలవికాస్ పిల్లలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం


విశాఖపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

సిరిపురం, మే 18 (ఆంధ్రజ్యోతి) : వారంతా...నలుగు దశాబ్దాల తరువాత కలుసుకున్నారు. ఒకరినొకరు గుర్తుపట్టలేనంతగా మారిపోయారు.. ఒక్కసారిగా వారంతా చూసుకుంటూ.. 'ఏం గణపతి.. నువ్వేనా...?

'అవునూ మాధవా.. నేవేనా..!!' అంటూ పలకరించుకుంటూ అలనాటి మధురస్మృతులకు వెళ్లిపోయారు.

సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సంఘం (1982-83) ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఓ హోటల్‌లో ఆత్మీయ కలయిక కార్యక్రమాన్ని నిర్వహించారు. అందరూ కూడా అప్పటి జ్ఞాపకాలను నెరవేసుకున్నారు. ఇన్నాళ్ల తరువాత కలుసుకుని కాసేపు హాయిగా...బాల్యాన్ని నెమరవేసుకున్నారు. సంఘం సభ్యులు గణపతి వీఎస్ఆర్కే, కేవీ మాధవరావు, రొబ్బి శ్రీనివాస్, వి.లక్ష్మీనారాయణ, కె.రామకృష్ణ, కేవీ స్వరూప్, జి.శ్రీనివాస్ ఆత్మీయక కలయికలో ముఖ్యభూమిక పోషించారు. వారంతా పలు ఉద్యోగాలు, వ్యాపారాలు, వివిధ వృత్తుల్లో స్థిరపడి ఆనందానోత్సవాల నడుమ ఆత్మీయ కలయికలో పాలుపంచుకున్నారు.

ఈ నేపథ్యంలో విశాఖపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.కె. శ్రీనివాస్‌ను ఘనంగా సత్కరించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన వారందరినీ తలుచుకుంటూ... సందడి చేశారు.

స్టీల్‌ప్లాంటులో 300 టన్నుల ఉక్కు ద్రవం నేలపాలు


నేలపాలైన ద్రవపు ఉక్కు

ఉక్కుటౌన్‌షిప్ (విశాఖపట్నం), మే 18 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్ ఫర్నేస్-2లో సుమారు మూడు వందల టన్నుల ద్రవపు ఉక్కు నేలపాలయింది. ఇందుకు సంబంధించి విభాగం ఉద్యోగులు తెలిపిన వివరాల ప్రకారం....బ్లాస్ట్‌ఫర్నేస్ నుంచి టర్పో ల్యాడిల్ కార్ (టీఎల్‌సీ)లోకి ద్రవపు ఉక్కును నింపి, దీనిని ఎస్ఎంఎస్ (స్టీల్ మెల్ట్‌షాప్)కు తరలిస్తుంటారు. ఈ క్రమంలో టీఎల్‌సీకి రంధ్రం పడడంతో ద్రవపు ఉక్కు నేలపాలైంది. సమాచారం అందుకున్న స్టీల్‌ప్లాంట్ ఫైర్ విభాగం సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ట్రాక్‌పై పడిన ద్రవపు ఉక్కును తొలగింపు, లాడిల్ కార్‌ను పక్కకు తొలగించారు. ఈ ప్రమాదంలో ట్రాక్ దెబ్బతినడం, కేబుల్స్ కాలిపోవడం తప్ప ఎవరికీ హానీ కలగలేదు.

భారత సైనికులకు నగర కళాకారుల సంఘీభావం



భారత సైనిక దళాలకు మద్దతు తెలుపుతూ నినాదాలు చేస్తున్న కళాకారులు

సిరిపురం, మే 18 (ఆంధ్రజ్యోతి) : తీవ్రవాదాన్ని తుదముట్టించేందుకు ఆపరేషన్ సిందూర్ పేరిట భారత సైనికులు జరిపిన పోరాటానికి మద్దతు తెలియజేస్తూ విశాఖ కళాకారులు సంఘీభావం ప్రకటించారు. ఆదివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద విశాఖ సకల కళాకారుల సంఘం ఆధ్వర్యంలో కళాకారులు హాజరై భరతమాతకు జై... వందేమాతరం, టెర్రరిజం నశించాలి...సైనికులకు సలాం సలాం' అంటూ నినాదాలు చేశారు. కళా సంఘాల ప్రతినిధులు యాక్మీప్రతాప్, సన్‌మూర్తి, భయ్యా శ్రీనివాస్, బొడ్డేటి జగత్‌రావు, తిరుమలరావు,నాంచారయ్య, మను పల్లా తదితరులు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గౌరవ అతిథిగా హాజరైన బీజేపీ జిల్లా అధ్యక్షుడు మంతెన పరశురామ్‌రాజు మాట్లాడుతూ కళాకారులు సామాజిక చైతన్యం రగిల్చే ఇటువంటి క్యార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. పలువురు వక్తలు మాట్లాడుతూ విశాఖలో కళాకారులు, కళా సంఘాలు ఇటువంటి కార్యక్రమాల్లో భాగస్వాములై భారతదేశ సార్వభౌమాధికత్వాన్ని, సమైక్యతను, స్ఫూర్తినీ చాటిచెబుతుండడం ఆనందకర విషయమన్నారు. కార్యక్రమంలో కాల్యు జనార్దన్, లెఫ్టినెంట్ లోకేష్, మాజీ సైనిక్ ఉద్యోగులు సుభాన్, ప్రకాష్, ఆడారి కిశోర్, తుని మణి, భూపతి, గరీమా, ఆనంద్, రాఘవ, రమేష్, ఎంవీఆర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా లారీ డ్రైవర్ మృతి

» విశాఖలో ఉంటున్న చిన్నారావు ట్యాంకర్ ద్వారా కాకినాడలో ఆయిల్ అన్‌లోడ్

» తిరుగు ప్రయాణంలో లంకెలపాలెం పెట్రోల్ బంకు వద్ద రాత్రి పార్కింగ్

» ఉదయం విగతజీవిగా మారడంతో పోలీసులు కేసు నమోదు


ట్యాంకర్ వద్ద మృతి చెంది ఉన్న డ్రైవర్ చిన్నారావు

లంకెలపాలెం, మే 18 (ఆంధ్రజ్యోతి) : అనుమానాస్పదంగా ఓ ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్ మృతి చెందాడు. జాతీయ రహదారి లంకెలపాలెం పెట్రోల్ బంకు వద్ద చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపినవివరాలివి. శ్రీకాకుళం జిల్లా జి.సిగడాం మండలం బాతువ ప్రాంతానికి చెందిన పొంద్రంగి చిన్నారావు (40) ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. విశాఖపట్నం వెంకోజీపాలెంలో కుటుంబసభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. కాకినాడలో ఆయిల్ అన్‌లోడ్ చేసి బయల్దేరి, పరవాడ మండలం లంకెలపాలెం పెట్రోల్ బంకు వద్ద శనివారం రాత్రి వాహనాన్ని పార్కింగ్ చేశాడు. ఆది వారం ఉదయానికి అతడు తన ట్యాంకర్ వాహనం పక్కనే విగతజీవిగా పడిఉన్నాడు. ఇది గుర్తించిన స్థానికులు పరవాడ పోలీసులకు సమాచారం అందిం చారు. వెంటనే వారు వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. అయితే మృతదేహంపై ఎలాంటి గా యాలు లేవని, అనారోగ్యం కారణంగానే మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

జాయ్‌జెమీమియా కేసులో కీలక ముఠా సభ్యుడి అరెస్టు

విశాఖపట్నం, మే 18 (ఆంధ్రజ్యోతి): నగరంలో సంచలనం సృష్టించిన జాయ్ జమీమియా కేసులో కీలక ముఠా సభ్యుడిని భీమిలి పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. దీంతో ఈ కేసులో ఇప్పటి వరకు అరెస్ట్ అయినవారి సంఖ్య నాలుగుకు చేరింది. ప్రేమ పేరుతో పలువురు యువకులు, సంపన్న కుటుంబాలకు చెందిన వారిని లోబరుచుకుని, వారితో ఏకాంతంగా ఉన్నపుడు ఫొటోలు, వీడియోలు తీయడం, మత్తుమందు ఇచ్చి వారిని నగ్నంగా మార్చి ఫొటోలు, వీడియోలు తీసి కంచరపాలేనికి చెందిన జాయ్‌జెమీమియా నిలువు దోపిడీ చేసిన విషయం తెలిసిందే. జాయ్‌జెమీమియా ఆగడాలపై నగరంలోని పలుపోలీస్‌స్టేషన్లలో బాధితులు ఫిర్యాదు చేయగా, కేసులు నమోదు చేసిన పోలీసులు జాయ్‌జెమీమియాతో పాటు ఆమెకు సహకరించిన ముఠా సభ్యులు పలువురిని అరెస్టు చేసి కొన్నాళ్ల కిందట రిమాండ్‌కు పంపించారు.

తాజాగా ఎన్ఏడీ ప్రాంతానికి చెందిన పొలమరశెట్టి రత్నరాజు (46) జాయ్‌జెమీమియాతో ఆర్థిక లావాదేవీలు భారీ మొత్తంలో జరిపినట్టు పోలీసులు గుర్తించారు. దీంతో మురళీనగర్ పాస్‌పోర్టు కార్యాలయంలో సమీపంలోని భవనంలో గ్లోబల్ ఐటీసీ కంపెనీ సీఈవోగా పని చేస్తున్నట్టు గుర్తించిన పోలీసులు ఆయన్ని ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ తిరుమలరావు తెలిపారు.

శివాజీపాలెంలో అన్నసమారాధన


అన్నదానం చేస్తున్న శ్రీకృష్ణ సేవాసంఘం సభ్యులు

మద్దిలపాలెం, మే 18 (ఆంధ్రజ్యోతి) : శివాజీపాలెంలోని పోలమాంబ అమ్మవారి వార్షిక జాతర మహోత్సవాల సందర్భంగా ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. శ్రీకృష్ణ సేవాసంఘం ఆధ్వర్యంలో సుమారు 3 వేల మందికి అన్నదానం చేశారు. పెద్ద ఎత్తున భక్తులు అన్నదానంలో పాల్గొని అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు బొట్టా వెంకటరమణ, శ్రీకృష్ణ సేవా సంఘం అధ్యక్షుడు దువ్వి నాగరాజు, ప్రధాన కార్యదర్శి బుద్ధల కృష్ణ, కోశాధికారి దువ్వి వెంకటస్వామి, కార్యనిర్వాహక కార్యదర్శి చెల్లి బోయిన సునీల్‌కుమార్, కార్యదర్శులు మువ్వల మౌళి, ఎం.హరిప్రసాద్, సాంబశివరావు, ఒమ్మి అప్పారావు, వైసీపీ వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్ పాల్గొన్నారు.

జగదాంబ
DOLBY ATMOS LASER 4K
11.00, 2.30, 6.30, 10.00
